ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
ఆదివారం 6 ఏప్రిల్ 2025 | 5





రాముడి పెళ్లికి.. రత్నగిరి ముస్తాబు
శ్రీరామగిరిలో సర్వం సిద్ధం
ఇందుపల్లిలో బొందరాములోరు 6

అందరి బంధువయా.. భద్రాచల రామయ్యా!

నేడు రాములోరి కల్యాణం

గొల్లలమామిడాడ ముస్తాబు

అందరి బంధువయా.. భద్రాచల రామయ్య.. ఆదుకునే ప్రభువయ్యా..మా అయోధ్య రామయ్య.. రాములోరంటే గ్రామాల్లో ఒక సెంటిమెంట్.. నిత్యం ఆయన సేవలోనే తరిస్తారు.. కొలుస్తారు.. ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఆలయాలను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు.. సీతారాముల కల్యాణం చూతము రారండి.. అంటూ భక్తులందరికీ ఆలయ కమిటీ సభ్యులు పిలుపునిస్తున్నారు. శ్రీరామ నవమి సందర్భంగా కాకినాడ జిల్లా పెదపూడి మండలం గొల్లలమామిడాడలో దశాబ్దాల తరబడి సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటారు. మన రాష్ట్రంలోనే ఒంటిమిట్ట తర్వాత అంతటి ప్రాచుర్యం పొందిన అతి పెద్ద రామాలయం ఇదే. ఆంధ్రా భద్రాద్రిగా పేరుగాంచిన ఈ ఆలయానికి ఎంతో చరిత్ర ఉంది. తూర్పు, పశ్చిమ దిశల్లో అత్యంత ఎత్తయిన గోపురాలు అందరి దృష్టిని ఆకర్షిస్తాయి. రామాయణ, భాగవతాల్లోని అపురూప ఘట్టాలతో మనోహరంగా తీర్చిదిద్దిన శిల్పాలు అద్భుతంగా కనిపిస్తాయి. శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం కోదండరాముడి ఆలయంలో జరిగే కల్యాణోత్సవానికి భారీగా ఏర్పాట్లు చేశారు. వివాహం కానివారు స్వామి వారి పెళ్లి తలంబ్రాలు శిరస్సుపై ధరిస్తే కల్యాణం జరుగుతుందని..సంతానం లేని దంపతులు తలంబ్రాల బియ్యాన్ని క్షీరాన్నంగా చేసుకుని భుజిస్తే సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం.కలెక్టర్,ఎస్పీలు కుటుంబ సమేతంగా విచ్చేసి ముత్యాల తలంబ్రాలు అందించడం ఆనవాయితీ. ఆదివారం కల్యాణం, సోమవారం సుప్రభాత సేవనిత్య పూజ, తీర్థగోష్ఠి, 8వ తేదీన శేషవాహనంపై స్వామి వారి బ్రహ్మోత్సవం,10న స్వామి వారి పుష్కరణి వద్ద వసంతోత్సవం, చక్రస్నానాలు, 11న నిత్యార్చన, ఉయ్యాల సేవ, శ్రీపుష్పయాగం నిర్వహిస్తారు. - కాకినాడ/ఆంధ్రజ్యోతి

గోదారి.. నీరేది!



కాలువలు కట్టేస్తే.. గొంతు తడిపేది కన్నీళ్లే!

తూర్పుగోదావరి.. పేరులోనే గోదావరి.. ఎందుకంటే.. జిల్లాకు జీవం గోదావరి.. ఆ గోదారే లేకపోతే ఈ ప్రాంతమంతా ఎడారే.. ఆ నాడు కాటన్ మహాశయుడు గోదావరిపై బ్యారేజీ నిర్మించి గోదావరి జిల్లాల రైతులకెంతో మేలు చేశాడు. అందుకే నేటికీ కాటన్‌ను జిల్లావాసులు దేవుడిగా కొలుస్తారు. గోదావరి ద్వారా ప్రతి ఏటా వేలాది టీఎంసీల నీరు మనకు లభిస్తున్న సంగతి తెలిసిందే.అందులో కొద్దిశాతం కూడా మనం వినియోగించుకోలేకపోతున్నాం. తీవ్ర నీటి ఎద్దడితో కొట్టుమిట్టాడుతున్నాం. నేటికీ ఈ పరిస్థితుల్లో మార్పురాలేదు.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా తాగునీటి ఎద్దడి ఉందంటే నిర్లక్ష్యమే కారణం..

(రాజమహేంద్రవరం/అమలాపురం - ఆంధ్రజ్యోతి)

రానున్న రెండు నెలలు ప్రజలు తాగు, సాగునీటి ఎద్దడిని ఎదుర్కొనాల్సిన పరిస్థితులు ఉత్పన్నం కానున్నాయి. ఉభయగోదావరి జిల్లాల్లో ఇప్పటికీ శివారు భూములకు దాళ్వాకు అవసరమైన సాగునీరందని కారణంగా పంటలు ఎండిపోతున్నాయి. నీటి ఎద్దడిని అధిగమించడానికి జలవనరులశాఖ అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఆశించిన మేర ప్రయోజనాలు చేకూర్చడంలేదు. డ్రెయిన్లలో క్రాస్‌బండ్లు ఏర్పాటు చేసి శివారు ప్రాంత భూములకు నీరందించాలని కోనసీమ కలెక్టర్ ఇప్పటికే ఇరిగేషన్, డ్రెయిన్ల అధికారులకు ఆదేశాలిచ్చారు.ఆ దిశగా వారు ప్రయత్నాలు చేస్తున్నారు. సాధారణంగా రబీ సీజన్‌తోపాటు మంచి నీటి అవసరాలు, చెరువులకు సుమారు 120 టీఎంసీలు అంచనా వేస్తారు. ఇప్పటివరకూ 103 టీఎంసీల నీటిని వాడారు.11,300 క్యూసెక్కుల నీటిని ఒక టీఎంసీగా పరిగణిస్తారు. మరో పది రోజుల పాటు కాల్వలకు నీరిస్తారు. ఈలోపు పంట అవసరాలు, మంచినీటి అవసరాలు, చేపల చెరువులకు అవసరమైన నీటిని నిల్వ చేసుకోవాలని ఇరిగేషన్ అధికారులు ఆదేశాలు జారీచేశారు. అయితే నీరు కాల్వలకు పూర్తిస్థాయిలో విడుదల చేయకపోవడంతో మంచినీటి ప్రాజెక్టులకు పూర్తిస్థాయిలో నీరు నింపే పరిస్థితి లేదనేది ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ప్రజల ఆవేదన. కోనసీమ జిల్లా పరిధిలోని నాలుగు మునిసిపాలిటీలు, 22 మండలాల పరిధిలో 220కు పైగా గ్రామాలు ఉండగా వాటిలో సముద్రతీర ప్రాంతాల ప్రజలకు తాగునీరందని పరిస్థితులు ఉన్నాయి. ప్రస్తుతం ఏప్రిల్, మే, జూన్ 15 వరకు ట్యాంకర్ల ద్వారా శివారు ప్రాంతాలకు మంచినీటిని సరఫరా చేయడానికి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.కలెక్టర్ ఆమోదం తరువాత వీటికి నీటిని సరఫరా చేయనున్నారు.

16 నుంచి నీరు బంద్

ధవళేశ్వరం కాటన్ బ్యారేజి నుంచి వివిధ ప్రాంతాలకు నీటిని తీసుకెళ్లే డెల్టా కాలువలను ఈనెల 16న మూసివేయనున్నారు. ప్రతి ఏటా రబీ సీజన్ ముగిసిన తర్వాత మంచినీటి అవసరాలకు నీటిని ఇచ్చి కాలువలకు నీటి విడుదల నిలుపుదల చేస్తారు. అనంతరం కాలువల ఆధునీకరణ పనులు చేస్తారు. జూన్ 1వ తేదీన కాలువలు తెరిచే అవకాశం ఉంది.

- మరో పది రోజుల్లో నీరు బంద్
- కాలువలు కట్టేస్తున్నట్టు ప్రకటన
- నేటికీ నిండని చెరువులు
- కళతప్పిన జలాశయాలు
- శివారుకు అందని సాగునీరు
- ప్రస్తుత నీటిమట్టం 9.5 అడుగులు
- గతేడాది ఇదే రోజు 6.5 అడుగులు
- 239 టీఎంసీలు వినియోగం
- సముద్రంలోకి 4114 టీఎంసీలు

బ్యారేజీ వద్ద నీటిమట్టం ఇలా

ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో తూర్పు డెల్టాలో 2,64,533 ఎకరాలు, కోనసీమ (సెంట్రల్ డెల్టా)లో 1లక్షా 72వేల ఎకరాలు, పశ్చిమ డెల్టాలో 4 లక్షల 60వేల ఎక రాలు ఆయ కట్టు ఉంది.రబీ సీజన్ డిసెంబర్‌లో మొదలైంది. పూర్తిగా నాట్లు పడేసరికి జనవరి దాటేసింది. ఈ నేపథ్యంలో కొంతనీటి సమస్య ఉంది. వాస్తవానికి నవంబర్ 1న రబీ సీజన్ మొదలయ్యేటట్టు ప్లానింగ్ ఉంటే రబీకి నీటి సమస్య ఉండదు. ప్రస్తుతం సీలేరు నుంచి 8 వేల క్యూసెక్కుల నీరు వస్తోంది. తూర్పు డెల్టాకు 3 వేల క్యూసెక్కులు, సెంట్రల్ డెల్టాకు 2 వేల క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 5,300 క్యూసె క్కులు విడుదల చేస్తున్నారు. పోలవరం స్పిల్‌వే వద్ద సుమారు 20 టీఎంసీల వరకూ నీరు ఉన్నట్టు చెబుతున్నారు. దీంతో ఈ సీజన్‌కు పెద్దగా నీటి సమస్య ఉండదని ఇరిగేషన్ ఎస్ఈ కె.గోపీనాథ్ తెలిపారు. ఇదిలా ఉండగా ధవళేశ్వరం బ్యారేజీ నీటిమట్టం ప్రస్తుతం 9.5 అడుగులు ఉంది. గతేడాది ఇదే సమయానికి కేవలం 6.05 అడుగులు మాత్రమే ఉంది. గతేడాది కంటే ఈసారి బాగుందని లెక్కలు చెబుతున్నాయి.

సముద్రంలోకి వేలాది టీఎంసీలు

గతేడాది జూన్ నుంచి ఇప్పటి వరకూ ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ నుంచి 4114 టీఎంసీల గోదావరి నీరు సముద్రంలోకి వదిలేయాల్సి వచ్చింది. కేవలం 239 టీఎంసీల నీరు మాత్రమే వినియోగించాం. ఒక టీఎంసీ అంటే 11,300 క్యూసెక్కులు నీరు.ఒక టీఎంసీ నీటిని వదిలితేనే మన డెల్టా కాలువలు కళకళలాడిపోతాయి. అలాంటిది వేల టీఎంసీల నీటిని వినియోగించుకుంటే గోదావరి జిల్లాలతో పాటు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. అందుకే పోలవరం ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. గత వైసీపీ నిర్లక్ష్యం చేసినా.. ప్రస్తుత సీఎం నారా చంద్రబాబునాయుడు పోలవరం పనులు వేగవంతం చేశారు.

ఆ మూడింటికి నీటి ఎద్దడి తప్పదా!

సామర్లకోట : సామర్లకోట గోదావరి కాలువకు గత రెండు రోజులుగా నీటి విడుదల తగ్గింది. దీంతో సాగు, తాగునీటికి ఆందోళన చెందుతున్నారు. సామర్లకోట,పెద్దాపురం మునిసిపాలిటీల ప్రజలకు తాగునీటి సరఫరాకు సామర్లకోటలో వేసవి జలాశయం, మహర్షి సాంబ మూర్తి రిజర్వాయర్లు ఉన్నాయి. మహర్షి సాంబమూర్తి రిజర్వాయర్ నుంచే కాకినాడ కార్పొరేషన్ ప్రజలకు తాగునీరు సరఫరా చేస్తారు.అయితే ఈ జలాశయాల్లో నీటి నిల్వలు అడు గంటితే గోదావరి కాలువ నుంచి జలాలను మళ్లించి నిల్వలు పెంచుతారు. సామర్లకోట గోదావరి కాలువకు రెండు రోజులుగా నీటి నిల్వలు తగ్గిపోవడంతో సామర్లకోటలో ఉన్న రెండు జలాశయాలకు నీటిని మళ్లించలేకపో తున్నారు. ప్రస్తుతం గోదావరి కాలువ నుంచి నీటిని మళ్లించకపోతే రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి ఎదురయ్యే ప్రమాదం ఉంది. ఈ ఏడాది జలాశయంలో పూడిక తొలగింపు పనులు చేపడతామని గోదావరి జలాలను జలాశయంలోకి మళ్లించే ప్రక్రియ గత నెల రోజుల పైబడి నిలిపివేశారు. దీంతో గోదావరి కాలువ నుంచి వస్తున్న కొద్దిపాటి జలాలనే నేరుగా ఫిల్టర్‌వాటర్ స్కీమ్‌కు పంపింగ్ చేసి అరకొరగా ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు.నీటి అక్రమ వినియోగం నియంత్రించలేకపోవడం వల్ల సామర్లకోట, ఉండూరు, వీకె.రాయపురం, మాధవపట్నం, బోయినపూడి, పిఠాపురం బ్రాంచి కాలువలకు చెందిన ఆయకట్టు పొలాలకు నీటి ఎద్దడి నెలకొంది.తాగునీటి జలాశయాలకు నీటి మళ్లింపు పూర్తిగా నిలిచిపోవడంతో మరో వారం రోజుల్లో సామర్లకోట, పెద్దాపురం మునిసిపాలిటీలు, కాకినాడ నగరపాలక సంస్థల ప్రజలు తాగునీటికి అవస్థలు పడక తప్పదని ఆందోళన చెందుతున్నారు. సామర్లకోట గోదావరి కాలువకు ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ ఉన్నతాధికారులు 3,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు ప్రకటించినప్పటికీ 60 కిలోమీటర్ల శివారున ఉన్న సామర్లకోటకు చేరేసరికి కేవలం 300 క్యూసెక్కుల నీరు అందుబాటులో ఉండడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. సాగునీటి అవసరాలే అంతంత మాత్రంగా ఉన్న సమయంలో ఇక తాగునీరు మళ్లింపు మరింత కష్టంగా మారనున్నాయి.



ఈ సారి ప్రాజెక్టులకు నీటి సమస్య లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఇరిగేషన్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

తపో ఆశ్రమ ప్రాంతం పర్యాటక కేంద్రం అయ్యేనా?





బాలయోగీశ్వరుల తపో ఆశ్రమ ముఖ ద్వారం... బాలయోగీశ్వరుల తపో ఆశ్రమం

- ముమ్మిడివరంలో రూ.కోటితో ప్రాజెక్టు
- అసంపూర్తిగా నిలిచిన పనులు
- దివంగత నేత జీఎంసీ బాలయోగి సంకల్పం నెరవేరేనా

ముమ్మిడివరం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక కేంద్రమైన ముమ్మిడివరం శ్రీభగవాన్ బాలయోగీశ్వరుల తపో ఆశ్రమ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలనేది లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి కల. ఇందుకోసం 1998-99లో రూ.కోటితో ఓ ప్రాజెక్టును రూపొందింపజేశారు. ఆ మేరకు పనులు ప్రారంభమైనా ప్రాజెక్టు పూర్తికాక చేసిన పనులు శిథిలావస్థకు చేరుకున్నాయి. నిష్ఠాగరిష్ఠులు, ముని వరులకు నిలయమైన ముమ్మిడివరం ప్రపంచవ్యాప్తంగా ఆధ్యాత్మిక ప్రదేశంగా ఖ్యాతిని ఆర్జించింది. దేశవిదేశాల నుంచి యాత్రికులు ఇక్కడకు సందర్శనకు రావడంతో ఈ ప్రాంతాన్ని టెంపుల్ టూరిజం కేంద్రంగా అభివృద్ధిచేయాలని జీఎంసీ బాలయోగి ఆశయంగా ఉండేది. దీనిలో భాగంగా ప్రధాన రహదారి నుంచి బాలయోగీశ్వరుల తపో ఆశ్రమం వరకు సుమారు 800 మీటర్ల ప్రాంతాన్ని పర్యాటకేంద్రంగా తీర్చిదిద్దేందుకు సుమారు రూ.60 లక్షలతో కొన్ని పనులు చేపట్టినా కాలక్రమేణా అవి శిథిలమయ్యాయి. రోడ్లు, విద్యుత్ దీపాలు, రక్షణ గోడలు, వంతెనలు నిర్మించినా ప్రాజెక్టు పూర్తికాకుండానే శిథిలమయ్యాయి. పంట కాల్వలకు ఇరుపక్కలా ఉన్న గట్టుకు రక్షణ గోడలు నిర్మించి రోడ్డును ఆధునికీకరించి అమలాపురం కాటన్ పార్కు నమూనాలో మొక్కలు నాటి విద్యుత్ కాంతులతో పర్యాటకులను ఆకర్షించేలా సుందరంగా తీర్చిదిద్దాలన్నది ప్రధాన ఉద్దేశం. దీనిలోభాగంగా రూ.30 లక్షలతో పంటకాల్వకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించి రూ.15లక్షలతో కాల్వ ఎడమగట్టుకు సీసీ రోడ్డు, మరో రూ.5 లక్షలతో కుడిగట్టుకు సీసీ రోడ్డు నిర్మింపజేశారు. రూ.10 లక్షతో విద్యుద్దీపాలు ఏర్పాటుచేశారు. వీటిని బెంగళూరు నుంచి తీసుకువచ్చి ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ముఖద్వారాలు కూడా నిర్మింపజేశారు. కాల్వకు పలుచోట్ల వంతెనలు నిర్మించారు. అయితే జీఎంసీ బాలయోగి అకాల మరణంతో ప్రాజెక్టు సగంలోనే నిలిచిపోయి పనులు మూలనపడ్డాయి. విద్యుద్దీపాలు, స్తంభాలు శిథిలమై కేబుల్ వైరు పాడవడంతో అవి పనిచేయడం మానేశాయి. ఫుట్‌పాత్ వంతెనలు కూడా శిథిలమయ్యాయి. రోడ్డుకు ఇరుపక్కలా పిచ్చిమొక్కలు పెరిగి చెత్తాచెదారం పెరిగిపోయింది. పంటకాల్వకు నిర్మించిన రక్షణ గోడలు గతేడాది కూలిపోయాయి. 25,355 మంది జనాభా ఉన్న ముమ్మిడివరం నగర పంచాయతీకి సంబంధించి ప్రత్యేక పార్కు లేదు. ప్రజలు సేద తీరేందుకుగానీ, ప్రాంతంగా కూర్చొనేందుకుగానీ సరైన ప్రదేశం లేదు. తపో ఆశ్రమ ప్రాంతాన్ని పర్యాటకేంద్రంగా తీర్చిదిద్దితే పట్టణ వాసులకు, ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుంది. జీఎంసీ బాలయోగి తరువాత పదవులు చేపట్టిన పలువురు ప్రజాప్రతినిధులు పర్యాటక కేంద్రాన్ని పూర్తిచేస్తామని హామీ ఇచ్చినా అవి కార్యరూపం దాల్చలేదు. గత వైసీపీ హయాంలో అమలాపురం ఎంపీ చింతా అనురాధ, తపో ఆశ్రమ ప్రాంతానికి వెళ్లే రోడ్డుకు రూ.20 లక్షల నిధులు సమకూర్చడంతో సిమెంటు రోడ్డు నిర్మాణం జరిగింది. గత ఎన్నికల్లో జీఎంసీ బాలయోగి తనయుడు హరీష్‌మాధుర్ బాలయోగీశ్వరుల తపో ఆశ్రమ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చినా దానిపై ఇంకా దృష్టి సారించిన దాఖలాలు లేవు.





కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో బాబూజగ్జీవన్ రామ్ చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న జేసీ నిషాంతి, ఎస్పీ కృష్ణారావు

జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళులు

అమలాపురం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితకాలం పోరాడిన మహనీయుడిగా డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ చరిత్రలో నిలిచిపోయారని జేసీ టి.నిషాంతి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో జగ్జీవన్‌రామ్ 117వ జయంతి వేడుకను సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి జేసీ పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మాజీ ఉపప్రధాని జగ్జీవన్ రామ్ జయంతిని సమతాదివస్ వేడుకలుగా నిర్వహిస్తున్నామన్నారు. అణగారినవర్గాల పట్ల ఉన్న వివక్షతను రూపుమాపేందుకు ఆయన విశేష కృషి చేశారన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారిణి పి.జ్యోతిలక్ష్మీదేవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి కడలి కాశీవిశ్వేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, ఎల్డీఎం కేశవవర్మ, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, డీటీవో రామనాథం, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరిశేషు, ఎస్‌డీసీ కృష్ణమూర్తి, జిల్లా గృహనిర్మాణ సంస్థ అధికారి నరసింహారావు, వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్‌తోపాటు జంగా బాబూరావు, డీబీ లోక్ తదితర నేతలు పాల్గొన్నారు. అలాగే జిల్లా పోలీసు కార్యాలయంలోనూ జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. జగ్జీవన్ చిత్రపటానికి జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు పూలమాలలువేసి నివాళులర్పించారు. అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



పేరూరులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శనివారం పరిశీలిస్తున్న డీపీవో శాంతలక్ష్మి

స్వచ్ఛాంధ్ర సాధనలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలి

జిల్లాలో ఎస్‌డబ్ల్యుపీసీ షెడ్లు పూర్తి స్థాయిలో వినియోగానికి చర్యలు : డీపీవో

అమలాపురం రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర సాధనలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని జిల్లా పంచాయతీ అధికారిణి డి.శాంతలక్ష్మి పేర్కొన్నారు. చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడంతోపాటు ప్రజారోగ్యాన్ని సంరక్షిస్తూ చెత్త నుంచి సంపదను సృష్టించేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. జిల్లాలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలన్నింటినీ పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. పేరూరులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శనివారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 385 పంచాయతీలకుగాను ఇప్పటికే 268 గ్రామాల్లో ఎస్‌డబ్ల్యుపీసీ షెడ్ల నిర్మాణం పూర్తిచేయడం జరిగిందన్నారు. 256 కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేస్తుండగా 117 షెడ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయని పేర్కొన్నారు. పంచాయతీ ట్రాక్టర్లు ఇంటింటికీ తిరిగి తడిచెత్త-పొడిచెత్తలను వేర్వేరుగా సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. ఇప్పటికే పలు కేంద్రాల్లో వర్మీ కంపోస్టును తయారుచేయడం జరుగుతుందని వివరించారు. ఎస్‌డబ్ల్యుపీసీ షెడ్డులో చేపట్టాల్సిన కార్యక్రమాలను పంచాయతీ సిబ్బందికి వివరించారు. గ్రామ సర్పంచ్ దాసరి అరుణ, కార్యదర్శి వేగుళ్ల వెంకటరామన్, పర్తంశెట్టి శ్రీనివాస్, దాసరి డేవిడ్ పాల్గొన్నారు.

నేడు మండపేటలో మాంసం విక్రయాలు

మండపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఆదివారం నాడు కోనసీమ జిల్లా మండపేట పట్టణంలో మాంసాహార అమ్మకాలను నిలుపుదల చేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన చేస్తూ చికెన్, మటన్, చేపల విక్రయాలను నిలుపుదల చేసినట్టు చెప్పారు. మార్కెట్‌లో నిబంధనలు అతిక్రమించి ఎవరైనా విక్రయాలు జరిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.





ఎస్.యానాం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం... భీమనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఇలా అయితే చికిత్స ఎలా?

వైద్య సిబ్బంది కొరతతో పీహెచ్‌సీలు సతమతం.. మందులూ దొరకవు

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పల్లెల్లో సామాన్యులకు వైద్య సేవలందించే ప్రాథమిక వైద్యఆరోగ్య కేంద్రాలపై ప్రజాప్రతినిధుల అజమాయిషీ కొరవడింది. రోగులకు చికిత్స చేసే పీహెచ్‌సీలకు అన్ని వసతులూ అందుబాటులో ఉన్నాయా? లేదా? అని పట్టించుకునే నాథుడు లేడు. ఉదాహరణకు ఉప్పలగుప్తం మండలంలో మూడు ఆరోగ్య కేంద్రాలున్నాయి. వీటిలో ఎస్.యానాం పీహెచ్‌సీలో స్థానిక వేదాంత సంస్థ సహకారంతో నలుగురు వైద్యులతోపాటు కార్పొరేట్ మందులు అందుబాటులో ఉంటున్నాయి. ఇక భీమనపల్లి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులున్నారు. నెలకు సగటున 2500 మంది వైద్యం కోసం వస్తుంటారు. ఇక్కడ నైట్‌వాచ్‌మ్యాన్ లేక రాత్రి సమయంలో వచ్చే అత్యవసర కేసులను ఒక స్టాఫ్ నర్సు మాత్రమే చూడాల్సిన పరిస్థితి. నైట్ వాచ్‌మ్యాన్ లేని చోట రాత్రివేళల్లో మహిళా ఉద్యోగికి భద్రత ఏమేరకు ఉంటుందో ఉన్నతాధికారులకే తెలియాలి. ఉప్పలగుప్తం పీహెచ్‌సీ విషయానికొస్తే ఇక్కడ మిగిలిన రెండు పీహెచ్‌సీల కంటే ఓపీ ఎక్కువ. నెలకు 3,715- 4000 మధ్య ఓపీ ఉంటుంది. ముగ్గురు స్టాఫ్ నర్సులకుగాను ఒక్కరే ఉన్నారు. నాలుగు సబ్‌సెంటర్లు ఉంటే ఇద్దరే ఏఎన్ఎంలతో కాలక్షేపం చేస్తున్నారు. సచివాలయాల్లోనూ ఏఎన్ఎంల కొరత ఉంది. ఇక్కడ పీహెచ్ఎన్ లేరు. మండలంలోని మూడు పీహెచ్‌సీలు 24గంటల ఆసుపత్రులే. సాధారణంగా పీహెచ్‌సీలకు బీపీ, షుగర్, గ్యాస్ట్రిక్ రోగులే ఎక్కువగా వస్తుంటారు. ఈ రోగులు క్రమం తప్పకుండా మందులు వాడాలని వైద్యులే చెబుతారు. ఒక్కోసారి ఇన్సులిన్ కొరత ఏర్పడుతోంది. ఇటీవల గ్యాస్ట్రిక్ రోగులకు ఇచ్చే పాంటప్రాజోల్ మాత్రలు సరఫరా నిలిపివేశారు. గతంలో టీడీపీ పాలనలో పీహెచ్‌సీలకు ఛైర్మన్లను, డైరెక్టర్లను నియమించారు. మళ్లీ రోగులకు న్యాయం జరగాలంటే ఈ కమిటీలను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

రాములోరి కల్యాణం

● నేడు శ్రీరామనవమి వేడుకలు ● ముస్తాబైన రామాలయాలు
● చలువ పందిళ్లు ఏర్పాటు చేసిన ఆలయ కమిటీలు

చూతము రారండి



పెన్సిల్‌పై సీతారామచంద్రుల ఛాయాచిత్రం



ఆత్రేయపురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మెర్లపాలానికి చెందిన 10వ తరగతి విద్యార్థి మెర్ల సత్య సాయి రమ పెన్సిల్‌పై సీతారామ చంద్రుల ఛాయాచిత్రాన్ని గీసి తన భక్తిభావాన్ని చాటుకున్నాడు. శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా వేసిన ఈ చిత్రం పలువుర్ని విశేషంగా ఆకట్టుకుంది.

చారిత్రక పురుషుడు శ్రీరాముడు

● ప్రాచీన కాలం నుంచి నాణేల ముద్రణ



సీతారామ లక్ష్మణుల చిత్రాలు ముద్రించిన విజయనగర సామ్రాజ్య నాణేలు



కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రామాయణం ప్రతి మనిషికి నిత్య పారాయణం... అని వాల్మీకి మహర్షి చెప్పారు. రాముడు ధర్మానికి నిలువెత్తు రూపం. ఒక పరిపూర్ణ మానవుడికి ఉండాల్సిన లక్షణాలు కలిగి మనిషి ఎలా జీవించాలో, ఇతరుల పట్ల ఎలా ప్రవర్తించాలో స్వయంగా ఆచరించి చూపిన చారిత్రక పురుషుడు శ్రీరాముడు. ఆయన జీవితం మానవాళికి ఆదర్శప్రాయం. అటువంటి సీతారాములపై ప్రాచీన కాలం నుంచి రాజులు, సంస్థానాధీశులు నాణేలు ముద్రిస్తున్నారు. మన చరిత్ర, సంస్కృతిని ప్రతిబింబించే ఈ నాణేలను కాకినాడకు చెందిన ప్రముఖ నాణేల సేకరణకర్త మార్ని జానకీరామ చౌదరి సేకరించి భద్రపరిచారు. క్రీ.శ. 15వ శతాబ్దంలో విజయనగర పాలకులు సీతారామ లక్ష్మణులతో పాటు ఇతర దేవలను కూడా నాణేలపై ముద్రించేవారు. దక్షిణ భారతదేశాన్ని పాలించిన మధురై నాయక రాజులు కూడా శ్రీరామ, హనుమ, గణేశ వంటి చిత్రాలను కూడా ముద్రించి చలామణీ చేసేవారు. గత శతాబ్దాల్లో లభ్యమైన రామటంకాలు, రామమాడలు అని పిలిచే నాణేలను చారిత్రక పరిశోధకుల కథనాల ప్రకారం మొఘల్ పాదుషా అక్బర్, విజయనగర చక్రవర్తులు, కళింగ రాజులు ముద్రించినట్టు చెప్పారు. జె.గిబ్స్ అనే పరిశోధకుడి సమాచారం మేరకు దక్షిణ భారతదేశంలోని కొంతమంది హైందవ పూజారులు ముద్రించి, టోకెన్లుగా అమ్మడం జరిగింది.



మార్ని జానకిరామచౌదరి, నాణేల సేకరణకర్త, కాకినాడ

- ఆంధ్రజ్యోతి/కాకినాడ కార్పొరేషన్

శ్రీరామగిరిలో సర్వంసిద్ధం



వీఆర్‌పురం : ముస్తాబైన శ్రీరామగిరి దేవాలయం

వీఆర్‌పురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరామగిరిలో జరగబోయే రాములోరి కల్యాణానికి సర్వం సిద్ధం చేసినట్టు ఆలయ కమిటీ చైర్మన్ పెందుర్తి సుదర్శన్, ఈవో తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి నుంచి రెండో భద్రాద్రిగా పిలవబడే శ్రీరామగిరి కొండపై దక్షిణ ముఖంగా కొలువైవున్న సుందర సీతారామ చంద్రస్వామి వారి తిరు కల్యాణ మహోత్సవం కోసం ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. భద్రాద్రి బోట్ యూనియన్ ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లు, కుకునూరు, వేలేరుపాడు మండలలాల నుంచి కల్యాణానికి వచ్చే భక్తుల కోసం గోదావరి నదిపై మూడు బోట్లు ఏర్పాటు చేశామని బోట్ నిర్వాహకుడు మాదిరెడ్డి సత్యనారాయణ తెలిపారు.

రత్నగిరి రామయ్య పెళ్లి కొడుకాయనే..

అన్నవరం, ఏప్రిల్‌5 (ఆంధ్రజ్యోతి): అన్నవరం ఆలయ క్షేత్రపాలకుడిగా పూజలందుకుంటున్న సీతారాముల ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం నాలుగు గంటలకు రామాలయంలో ప్రత్యేక వేదికపై నవదంపతులు కానున్న సీతారాములు, మరో వేదికపై పెండ్లి పెద్దలైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను ఆశీనులు గావించి పండితులు గణపతిపూజతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. పుణ్యాహవచనం అనంతరం ఉల్లాకుల గౌరీపూజ నిర్వహించగా, ముత్తైదువులు పసుపు దంచారు. చివరగా చతుర్వేద పండితులు వేద స్వస్తి గావించారు. ఈవో వీర్ల సుబ్బారావు దంపతులు, చైర్మన్ రోహిత్, తదితరులు పాల్గొన్నారు.



అన్నవరంలో ప్రత్యేక పూజలు...

170 ఏళ్ల నాటి రామాలయం



పురాతన సీతంపేట రామాలయం

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా రాజమహేంద్రవరంలోని సీతంపేటలో 170 సంవత్సరాల చరిత్ర కలిగిన రామమందిరంలో ఆదివారం ఉదయం శాంతి కల్యాణం, తదుపరి సీతారామ కల్యాణం వైఖానస ఆగమ పద్ధతిలో జరుగుతుందని ఆలయ అర్చకుడు వై.శ్రీనివాసాచార్యులు తెలిపారు. నవమి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదిరోజుల పాటు ప్రతిరోజూ ఉదయం స్వామివారి శాంతికల్యాణం, సాయంత్రం సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. సీతారామాలయం.. జాంపేట పోలీస్ క్వార్టర్స్‌లో ఈ ఆలయం వెలసి సుమారు 72 సంవత్సరాలైందని, దీన్ని దర్శించిన భక్తులు కోరిన కోర్కెలు సీతారాములు తీరుస్తారని నమ్మకం. అందువల్ల అనేక మంది భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని వచ్చి దర్శించుకుంటారని, ఈసారి సీతారాము కల్యాణానికి, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ దంపతులు వచ్చి పీటల మీద కూర్చుంటారని ఆలయ అధ్యక్షుడు ఏవీ రమణారెడ్డి తెలిపారు. ఈ నెల 17న ఆలయం వద్ద జరిగే మహాన్నదానానికి దాత ఎంవీ కృష్ణారెడ్డి రూ. రెండు లక్షల విరాళంగా ఇచ్చారని పేర్కొన్నారు.

రాములోరి కల్యాణంలో వింతలెన్నో..

ఒక్కో గ్రామంలో ఒక్కో ఆచారం

శ్రీరామచంద్రుడు మానవునిగా జన్మించినరోజు శ్రీరామనవమి. కానీ ఆయన పుట్టినరోజు నాడే జగత్ కల్యాణ కారుకులుగా సీతారాముల కల్యాణం జరపడం అనాదిగా వస్తున్న ఆచారం. నేటి ఆధునిక సమాజంలో అష్టకష్టాలు పడుతున్నామని వాపోయేవారు ఎందరో. కానీ శ్రీరామచంద్రుడు పడినన్ని కష్టాలు ఇంతవరకు మరెవ్వరూ పడలేదంటే ఎంతమాత్రం అతిశయోక్తికాదు. ధర్మానికి ప్రతీకలైన ఆదర్శ దంపతులు సీతారాముల కల్యాణం శ్రీరామనవమి రోజున జరగని గ్రామం ఉండదు. రాములోరి కల్యాణం ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా జరగడం విశేషం.



భీమభక్తునిపాలెంలో విజయదశమి రోజునే కల్యాణం..

పేరూరు భీమభక్తునిపాలెంలో ఓ రామాలయం ఉంది. ఈ ఆలయంలో మాత్రం ఏటా విజయదశమి రోజున సీతారాముల కల్యాణం జరపడం ఇక్కడి ఆచారం. శతాబ్దాల కాలం కిందట నిర్మించిన ఆలయంలో తరతరాలుగా ఇదే ఆచారాన్ని గ్రామస్తులు కొనసాగిస్తున్నారు. సీతారాముల కల్యాణాన్ని శ్రీరామనవమి రోజున జరుపకపోవడానికి నాటి తరం వారు వలస కూలీలుగా పనిచేయడమే కారణమట. భీమభక్తునిపాలెం వాసులు పెంకు నేత పనిలో నిష్ణాతులు. శ్రీరామనవమి రోజుల్లో వీరంతా పెంకునేత పనుల్లో బిజీగా ఉండేవారు. నేడు పెంకుతీత పనులు లేకపోయినా అదే ఆచారాన్ని నేటికీ కొనసాగిస్తున్నారు. అయితే నవమి రోజున రామాలయం వద్ద అందరికీ పానకాలు పంచుతారు.

భట్లపాలెంలో తలంబ్రాల బియ్యంతో వంట..



సీతారాముల కల్యాణ తలంబ్రాల కోసం అందరూ ఎగబడతారు. అయితే ఇందుపల్లి శివారు భట్లపాలెంలోని శ్రీరామాలయం వద్ద మాత్రం తలంబ్రాల బియ్యంతో పిల్లలు పుట్టలేదన్న బెంగను తొలగించుకుంటారు. కల్యాణం అనంతరం సీతారాములపై పోసిన తలంబ్రాల బియ్యాన్ని ఎవరికి అందినంత వారు అందిపుచ్చుకుంటారు. సంతానం లేని దంపతులు, కుటుంబ సమస్యలతో బాధపడేవారు ఆ తలంబ్రాల బియ్యంతోనే రామాలయం వెనుక వంటలు చేసుకుంటారు. సీతారాముల కల్యాణ తంతు పూర్తయ్యేసరికి వంటలు పూర్తి కావడమే కాదు ఆ దంపతులు భోజనాలు పూర్తిచేయాలి. అలా చేసిన వారు త్వరలోనే తల్లిదండ్రులు అవుతారని భక్తుల ప్రగాఢ నమ్మకం. అందుకు ఎన్నో నిదర్శనలు ఉన్నాయంటున్నారు. కల్యాణ తలంబ్రాలతో వంట చేసుకోవడం తరతరాల ఆచారం.





ఇందుపల్లిలో బొందరాములోరు..

తమిళనాడుకు చెందిన ద్రావిడ బ్రాహ్మణులు వలస వచ్చి కోనసీమలోని పలు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. అటువంటి ద్రవిడ బ్రాహ్మణులు నివసిస్తున్న ప్రాంతాల్లో సీతారాముల కల్యాణంలో ఎన్నెన్నో వింతలు ఉన్నాయి. ప్రత్యేకంగా ఇందుపల్లిలో కూర అరటిగెల బొంతను శ్రీరామచంద్రునిగా కొలుస్తారు. బొందను తిరగేసి భూమిలో పాతి ప్రతిరోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉగాదిరోజున ప్రారంభించి వసంత నవరాత్రులుగా తొమ్మిది రోజుల పాటు నిత్యం పూజలు నిర్వహించడంతోపాటు హాజరైన భక్తులందరికీ పానకాలు అందిస్తారు. శతాబ్దాల కాలం కిందటే పేరి కామయ్య అనే వ్యక్తి బొందరాముని పూజలు ప్రారంభించారని పెద్దలు చెబుతారు. శ్రీరామనవమి రోజున కల్యాణం జరిపించే బొందరాముడిని ప్రత్యేక వాహనంలో ఉంచి నిమజ్జనం చేస్తారు. ఇక ద్రవిడ బ్రాహ్మణులు నివాసముంటున్న బోడసకుర్రు, అమలాపురం దుడ్డువారి అగ్రహారంలలో శ్రీరామచంద్రుడిని దబ్బాల రామునిగా కొలుస్తారు. అదేవిధంగా పేరమ్మ అగ్రహారంలో గోదారి రాముడంటూ కల్యాణం జరిపిస్తారు.

- ఆంధ్రజ్యోతి/అమలాపురం రూరల్

నేడు ర్యాలి జగన్మోహిని కేశవస్వామి కల్యాణం

● ఏర్పాట్లు పూర్తి



ర్యాలి జగన్మోహిని కేశవస్వామి, పూజలు చేస్తున్న అర్చకుడు



ఆలయ రాజగోపురం

ఆత్రేయపురం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పురాణ ప్రసిద్ధిగాంచిన ర్యాలి జగన్మోహిని కేశవ స్వామి కల్యాణోత్సవాలు నేటి నుంచి 13వ తేదీ వరకూ రంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం సాయంత్రం స్వామివారికి ప్రత్యేక పూజలు పెండ్లి కుమారుడిని చేయడం, గ్రామోత్సవం, అంకుర్పారణ, ధ్వజారోహణం, తదితర కార్యక్రమాలను నిర్వహించి రాత్రి 8.45 నిమిషాలకు వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం శ్రీనివాసుల వెంకటాచార్యులు బ్రహ్మత్వంలో స్వామివారి కల్యాణం వైభవోపేతంగా నిర్వహించనున్నారు. 7నుంచి 9వ తేదీవరకూ స్వామి వారికి అభిషేకం, తుసిపూజ, నిత్యపాసన తదితర కార్యక్రమాలతోపాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 10న సదస్యం, 11న ప్రత్యేక పూజలు, 12న చక్రస్నానం, 13న శ్రీపుష్పోత్సవంతో కల్యాణోత్సవాలు ముగియనున్నాయి. స్వామివారి ఉత్సవాలకు సంబంధించి అన్నిఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయ ఈవో బీహెచ్వీ రమణమూర్తి తెలిపారు.

స్వామివారి చరిత్ర...

స్వయంభూగా వెలిసిన జగన్మోహిని కేశవ స్వామి ముందు పురుష రూపం, వెనుక శ్రీరూపంలో దర్శనమిస్తారు. స్వామివారి పాదాల చెంత నిత్యం గంగ ఉద్భవిస్తుంది. స్వామివారి విగ్రహం ఎంతో కళా నైపుణ్యం సంతరించుకుంది. చూపరులను ఎంతగానో ఆకర్షిస్తుంది. శిల్ప కళానైపుణ్యం ప్రతిభింబిస్తోంది. గర్భాలయ ప్రవేశం కలదు. రావులపాలెం నుంచి 6 కిలో మీటర్ల దూరంలో ర్యాలి గ్రామంలో స్వామి వారి సన్నిధికి చేరుకోవచ్చు.

నిత్యాన్నదానం

దేశంలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం కావడంతో వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు. భక్తులకు ఉగాది నుంచి నిత్యాన్నదానం ప్రారంభించారు. సుమారుగా నెలకు 50వేల మంది భక్తులు తరలివస్తున్నారు. 20వేల మంది భక్తులు అన్నదానం స్వీకరిస్తారని అంచనా వేస్తున్నారు. వార్షిక ఆదాయం రూ.1.20కోట్లకు చేరుకుంది. అన్నప్రసాద విరాళాలు రూ.1.40కోట్లు సమకూర్చారు. స్వామివారి ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సీజేఎఫ్ నిధుల ద్వారా రూ.2కోట్లు మంజూరుకు ప్రతిపాదనలు రూపొందించారు. గోపాలస్వామివారి రాజగోపుర నిర్మాణం మాసకల్యాణ భవనం వసతిగృహాల నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించారు. కోరిన కోర్కెలు తీర్చే స్వామిగా ఖ్యాతిని అర్జించడంతో ఐదు బుధవారాలు ఐదు ప్రదక్షణలు స్వామివారికి భక్తులు నిర్వహించుకుంటున్నారు. ప్రతి నెలా మాసకల్యాణం(రూ.750). సుమారు 300 మంది స్వామి కల్యాణాలు నిర్వహిస్తారు.



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి

వాడపల్లికి పోటెత్తిన భక్తజనం

● వెంకన్న ఆదాయం రూ.50,34,559

ఆత్రేయపురం, ఏప్రిల్‌5 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధరకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారి తిరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లలో స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధసేవల ద్వారా స్వామివారి ఒక్క రోజు ఆదాయం రూ.50,34,559 లభించినట్లు ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



వాడపల్లిలో పర్యటిస్తున్న ఆర్డీవో శ్రీకర్

ఆర్డీవో పర్యటన

స్వామివారి కల్యాణోత్సవాలలో భాగంగా ఆర్డీవో పి.శ్రీకర్ శనివారం ఆలయంలో పర్యటించారు. డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావుతో కలిసి కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు. శనివారం భక్తుల రద్దీ, ఏర్పాట్లను పర్యవేక్షించారు. మంగళవారం స్వామివారి కల్యాణోత్సవానికి సంబంధించి ఏర్పాట్లపై తగుసూచనలు చేశారు.

కిక్కిరిసిన శృంగార వల్లభస్వామి ఆలయం



భక్తులకు దర్శనమిస్తున్న శృంగార వల్లభస్వామి

పెద్దాపురం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలో తొలి తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన శ్రీదేవి, భూదేవి సమేత శృంగారవల్లభస్వామివారి దివ్యక్షేత్రం శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీగా మారింది. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకునేందుకు వేకువజాము నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ సాంప్రదాయాల ప్రకారం స్వామి వారికి నిత్య కైంకర్యాలను అర్చకస్వాములు శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులను అనుమతించారు. స్వామివారిని సుమారు పదివేల మంది భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.2,18,640, అన్నదాన విరాళాల ద్వారా రూ.76,104, కేశఖండన ద్వారా రూ.6,880, తులాభారం ద్వారా రూ.200, లడ్డూప్రసాదం ద్వారా రూ.24,000, స్వామివారికి కానుకల ద్వారా రూ.110 కలిపి మొత్తం రూ.3,25,934 ఆ దాయం సమకూరినట్లు దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వసంత నవరాత్రి పూజలు

సామర్లకోట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వసంత నవరాత్రి మహోత్సవాలు పురష్కరించుకుని సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో బాలాత్రిపుర సుందరి అమ్మవారికి, కంచి మహాసంస్థానం ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం చెంతన స్వయంవరపార్వతి అమ్మవారికి ఏడో రోజైన శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో నిర్వహించిన పూజలలో పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజగోపాలశర్మ, అంజిబాబు, వెంకన్న తదితరులచే వేదమంత్రోచ్ఛారణల మధ్య అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. నూతన పట్టువస్త్రాలతో అమ్మవారిని సర్వాంగసుందరంగా అలంకరించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.





వసంతనవరాత్రి పూజలలో బాలాత్రిపుర సుందరి అమ్మవారు, పుష్పార్చనపూజలో స్వయంవరపార్వతి అమ్మవారు

క్రీడాకారులతో దేశానికి మంచి పేరు ప్రఖ్యాతలు

● తూర్పుగోదావరి ఎస్పీ నరసింహ కిశోర్

దివాన్‌చెరువు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు దేశానికి మంచి పేరు ప్రఖ్యాతలను తీసుకువస్తారని జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఏపీ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు శనివారం దివాన్‌చెరువులోని కళ్యాణ మండపంలో ప్రారంభమయ్యాయి. ఐకాన్స్ చార్టర్ ప్రెసిడెంట్ తీగలరాజా అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాకు చెందిన క్రీడాకారిణి కరణం మల్లేశ్వరి వెయిట్‌లిఫ్టింగ్ ద్వారా దేశానికి కీర్తిప్రఖ్యాతులు సాధించారని చెప్పారు. ఈ సందర్భంగా పోటీల నిర్వాహకులను ఆయన అభినందించారు. ఐకాన్స్ రాజమహేంద్రవరం అధ్యక్షుడు ఇమ్మణ్ణి వెంకట్ మాట్లాడుతూ అండర్-15, అండర్-20 బాలుర బాలికల విభాగంలో నిర్వహిస్తున్న ఈ కుస్తీపోటీలకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి 350 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. రెండు రోజులపాటు జరుగుతాయని చెప్పారు. ఈ పోటీల్లోని విజేతలు ఈనెల 23న రాజస్థాన్‌లోని కోటలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎలీషారావు మాట్లాడుతూ రాజమండ్రిలో ఆనాడు తాలింఖానాలు ఉండేవని ఎందరో క్రీడాకారులు మట్టిలో కుస్తీలు పట్టేవారని, ఇప్పుడు మేట్ మీద రెజ్లింగ్ పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ఏపీ అమెచ్యూర్ అసోసియేషన్ అధ్యక్షుడు మాణిక్యాలరావు, కార్యదర్శి వెంకటరమణ, ఐకాన్స్ రాజమహేంద్రవరం ఉపాధ్యక్షుడు వెంకన్నబాబు, కార్యదర్శి సురేష్, ఉదయగిరి, రోటరీ రివర్ సిటీ అధ్యక్షుడు నాళం నరసింహారావు, బూరుగుపల్లి రామారావు, బూరుగుపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేసి పోటీలు ప్రారంభిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్



కుస్తీపోటీలో తలపడుతున్న క్రీడాకారులు

శనేశ్వరాలయంలో భక్తుల రద్దీ

● స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.2.59 లక్షలు

కొత్తపేట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని మందపల్లి శనేశ్వర (మందేశ్వర) స్వామివారి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు క్యూ కట్టారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా రూ.2,59,464 ఆదాయం వచ్చినట్టు ఆలయ సహాయ కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.



శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వినోదం.. ప్రమాదం!

వేసవి రావడంతో రాజమహేంద్రవరం పుష్కర్‌ఘాట్‌కి పిల్లలు ఎక్కువగా వెళ్తున్నారు. స్నానాల సమయంలో వినోదం కోసం రకరకాల విన్యాసాలు చేస్తున్నారు. ప్రమాదమని తెలిసినా లోతుకు వెళ్తున్నారు. పాత రైలు వంతెన స్తంభాలకు వాటర్ మోటార్ల కోసం ఏర్పాటు చేసిన నిచ్చెన వంటి అమరిక ద్వారా ఎక్కి వంతెన పైనుంచి అమాంతం గోదావరిలోకి దూకుతున్నారు. కొందరు 2,3 స్తంభాల (స్పాన్లు) అవతలికి వెళ్లిపోతున్నారు. ఈ రేవులో బాగా లోతు ఉంటుంది. కానీ ఎక్కడా లోతును హెచ్చరించే బోర్డులు కానరావడం లేదు. వేసవి సెలవులు పూర్తిగా ఇస్తే ఈ రేవుకు పిల్లల తాకిడి మరీ ఎక్కువగా ఉంటుంది. గతంలో ఈ రేవులో పిల్లలు ప్రాణాలు పోగొట్టుకున్న ఘటనలు ఉన్నాయి. జనం భద్రతను గోదావరికి వదిలేయడం సరికాదని పలువురు అంటున్నారు.

- రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)



'వానా' వరణం..

- కాకినాడ జిల్లాలో భారీ వర్షం
- ఉదయం హాట్.. హాట్..
- సాయంత్రం కూల్ కూల్..
- నేలకొరిగిన చెట్లు, నీట మునిగిన వీధులు
- తడిసి ముద్దయిన ధాన్యపు రాశులు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

పగలంతా ఎండవేడిమితో అల్లాడిన కాకినాడ జిల్లా వాసులు శనివారం సాయంత్రం భారీగా కురిసిన వర్షంతో సేదదీరారు. వారం రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. రోజురోజుకీ ఉష్ణోగ్రతలు పెరుగుతూ 35 డిగ్రీలకు పైబడి నమోదవుతున్నాయి. ఎండదెబ్బకు జనం బయటకు వచ్చేందుకు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం పదిగంటల్లోపే అన్ని పనులు చక్కబెట్టుకుంటున్నారు. ఇక ఆఫీసులకు, వివిధ పనుల కోసం బయటకు వెళ్లే వాళ్లు ఎండ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇదిలా ఉంటే కాకినాడలో శనివారం ఉదయం 36 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. జనం ఆపసోపాలు పడ్డా రు. అయితే సాయంత్రం నాలుగు గంటల నుం చి జిల్లా వ్యాప్తంగా వాతావరణం పూర్తిగా మేఘావృతమైంది. భారీ ఈదురుగాలులు, ఉరుము లు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీం తో పలు చోట్ల వృక్షాలు నేలకొరిగాయి. మరోవైపు అకాల వర్షం అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లింది. కిర్లంపూడి, గండేపల్లి, జగ్గంపేట, పిఠాపురం, గొల్లప్రోలు, ఉప్పాడ, కాకినాడ రూరల్ తదితర ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం పడింది. పిఠాపురంలో వర్షానికి ధాన్యపురాశులు తడిసి ముద్దయ్యాయి. కాకినాడలోని పలు రహదారులు నీటమునిగాయి. పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. కచేరీపేటలో వృక్షం కూలింది. కొత్తపేట మార్కెట్ ఏరియా, సినిమారోడ్డు, రాగంపేట, బ్యాంకు పేట, మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో భారీగా వర్షపు నీరు నిలిచింది. ఇదిలా ఉంటే కాకినాడలో సాయంత్రం 5 గంటల నుంచి అంధకారం అలుముకుంది. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.



కాకినాడలోని ఓ రోడ్డులో నిలిచిపోయిన వర్షం నీరు

పిఠాపురం, గొల్లప్రోలులో భారీ వర్షం

పిఠాపురం/గొల్లప్రోలు, ఏప్రిల్ 5(ఆంధ్ర జ్యోతి): పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. వాతావరణం మేఘావృతమై భారీ గాలులతో సుమారు గంట పాటు కురిసిన వర్షంతో 2 పట్టణాల్లో రహదారులు జలమయమయ్యాయి. ఎక్కడిక్కడ డ్రైన్లు పొంగిపొర్లాయి. పలు చోట్ల రోడ్లపై నీరు నిలిచిపోయింది. చెట్లు కొమ్మలు విరిగి పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పలుచోట్ల మామిడితోటల్లో మామిడికాయలు రాలిపోయాయి. వాతావరణం చల్లబడటంతో ప్రజలు కాస్తా సేదతీరారు.



పిఠాపురంలో కురుస్తున్న భారీ వర్షం

రాష్ట్రంలోనే అధికశాతం నమోదు

కిర్లంపూడిలో 46.8 మిల్లీమీటర్ల వర్షపాతం

కిర్లంపూడి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడిలో శనివారం సాయం త్రం భారీ వర్షం కురిసింది. 46.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. రాష్ట్రంలోనే అధిక వర్షపాతం కిర్లంపూడిలో నమోదైందన్నారు. గంటపాటు ఎడతెరిపి లేకుండా ఏకధాటిగా వర్షం కురిసింది. రోడ్లన్నీ జలమయ్యాయి. డ్రైనేజీలన్నీ ఉప్పొంగాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మామిడిరైతులు ఆందోళన చెందుతున్నారు.



కిర్లంపూడిలో నేలకొరిగిన చేలు

ధాన్యం బస్తాలకు 'షెల్టర్'



ధాన్యం బస్తాలకు బస్‌షెల్టర్‌కు అక్కరుకు వచ్చింది. 216వ జాతీయ రహదారిపై తాటిపర్తి జంక్షన్‌కు దూరంగానేషనల్ హైవేస్ అథారటీ నిర్మించిన బస్‌షెల్టర్ కొంతకాలంగా నిరుపయోగంగా ఉంది. శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో ధాన్యం బస్తాలు తడవకుండా రైతులు ఈ బస్‌షెల్టర్‌లోకి చేర్చారు. వర్షానికి బయటభాగం కొంత తడిచినా కాపాడుకోగలిగామని, ఈ బస్‌షెల్టర్ ఈ విధంగా పనికొచ్చిందని రైతులు తెలిపారు.

(ఆంధ్రజ్యోతి-గొల్లప్రోలు రూరల్)

నేలకొరిగిన భారీ వృక్షాలు

మారేడుమిల్లి/కరప, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శనివారం ఈదురుగాలులకు మారేడుమిల్లి-భద్రాచలం ప్రధాన రహదారిపై భారీవృక్షం నేలకొరిగింది. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. దేవరపల్లి సమీపంలో రహదారికి అడ్డంగా నేలకొరగడంతో శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం వైపు వెళ్తున్న వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుని ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 108 వాహనం సైతం ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడంతో కొద్దిసేపు ఆం దోళన చెందారు. ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. వారిని రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సమీపంలోని దేవరపల్లి గ్రామ యువత స్పం దించి భారీ వృక్షాన్ని నరికి తొలగించారు. అలాగే ఈదురుగాలులకు కాకినాడ జిల్లా కరప మండలం సిరిపురం-జి.బావారం రోడ్డులో భారీవృక్షం నేలకొరిగింది. దీంతో ఆ రహదారిలో రాకపోకలు నిలిచిపోయాయి.



దేవరపల్లి సమీపంలో రోడ్డుకు అడ్డంగా పడిన భారీ వృక్షం



సిరిపురం-జి.బావారం రోడ్డులో నేలకొరిగిన భారీ వృక్షం

కాకినాడ జీజీహెచ్‌లో

ఇంటిగ్రేటెడ్ సెంటర్ ప్రారంభం

జీజీహెచ్ (కాకినాడ), ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సికిల్‌సెల్, రక్తహీనత, తలసేమియా తదితర ప్రాణాంతక వ్యాధులను నిర్ధారించేందుకు దోహదపడే ఏకీకృత కేంద్రాన్ని (ఇంటిగ్రేటెడ్ సెంటర్)ను డీఎంఈ, డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్శిటీ వీసీ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం శనివారం కాకినాడ జీజీహెచ్‌లో ప్రారంభించారు. ఐసీహెచ్‌హెచ్ సెంటర్‌కు జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా ఏపీ బ్లడ్‌సెల్ సంస్థ రూ.24 లక్షల నిధులతో ఖరీదైన పరికరాలను అందజేసింది. ఈ ఐసీహెచ్‌హెచ్ సెంటర్‌ను డాక్టర్ నరసింహం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరికరాల ద్వారా జన్యుపరమైన ఎరుపు రక్త కణాలకు వచ్చే వ్యాధులు అనగా సికిల్‌సెల్ ఎనీమియా, తలసేమియా, హిమోగ్లోబినో ప్యాథీస్, హిమోఫీలియా వ్యాధులను నిర్ధారించేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి 24 గంటల ల్యాబ్‌లో హెమటాలజీ అనలైజర్‌ను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఈ పరికరం ద్వారా త్వరితగతిన సిబిసి పరీక్షల నివేదికలను రోగులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. దీని వల్ల ఓపీ పేషెంట్లకు ఏ రోజుకారోజు రిపోర్టులు ఇవ్వడం ద్వారా అదే రోజున వ్యాధి నిర్ధారణ పూర్తి చేసి అదేరోజు ఉచితంగా ఔషదాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్, ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, పాథాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజ్యలక్ష్మి, పలువురు ఫ్యాకల్టీలు, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.



ఇంటిగ్రేటెడ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న డీఎంఈ డాక్టర్ నరసింహం

పల్లంలో హెపటైటిస్ కలకలం

రక్త నమూనాలు సేకరించిన వైద్యులు, 200మందికి రాపిడ్ టెస్ట్‌ల్లో పాజిటివ్



రక్త పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

కాట్రేనికోన, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లం గ్రామంలో కాలేయ వ్యాధులు ప్రబలుతున్నాయన్న సమాచారంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆరు వైద్య బృందాలు శనివారం గ్రామంలో హెపటైటిస్ బీసీ పరీక్షలు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి 15 ఏళ్ల దాటిన వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరు వేల మందికి పరీక్షలు నిర్వహించవలసి ఉండగా శనివారం 2వేల మందిని పరీక్షించినట్టు వైద్య సిబ్బంది తెలిపారు. వారిలో 200మందికి రాపిడ్ టెస్ట్‌ల్లో పాజిటివ్ వచ్చిందన్నారు. వారి రక్త నమూనాలను అమలాపురం ప్రభుత్వాసుపత్రిలో పరీక్షించి రోగ నిర్ధారణ చేస్తామన్నారు. అవసరమైన వారికి వైద్యం చేస్తామన్నారు. రూ.6వేలు ఖర్చయ్యే వైద్య పరీక్షలను ఉచితంగా చేస్తున్నామని, గ్రామంలో అందరూ ఈ పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారులు చెబుతున్నారు. హెపటైటిస్-సీ వైరస్ వల్ల కలిగే లివర్ వ్యాధి అని వైద్యాధికారిణి లిఖిత అన్నారు. రక్తం ద్వారా వ్యాపించే ఈ వ్యాధి కాలేయ కేన్సర్‌కు దారితీస్తుందన్నారు. ఇంజెక్షన్లు, మాదకద్రవ్యాల వినియోగం, సురక్షితం కాని వైద్య పద్ధతులు, తిరునాళ్లలో పచ్చబొట్లు వేయించుకోవడం, బహుళ భాగస్వాములతో లైంగిక సంపర్కం ఈ వ్యాధికి కొన్ని కారణాలుగా చెప్పారు. ఆలింగనం, ముద్దు, ఆహారం, నీరు ద్వారా ఈ వ్యాధి సోకదన్నారు. ఈ వ్యాధి సైలెంట్ కిల్లర్‌గా వ్యవహరిస్తుందన్నారు. ప్రస్తుతం ఈ వ్యాధిని పూర్తిగా నయం చేసేందుకు మందులున్నాయని వైద్యాధికారిణి తెలిపారు.

నేటి నుంచి గామన్ బ్రిడ్జిపై వార్షిక మరమ్మతులు

వారం రోజుల పాటు ఒక వైపే వాహన రాకపోకలు

కొవ్వూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు - రాజమహేంద్రవరం మధ్య గోదావరి నదిపై నిర్మించిన నాలుగులైన్ల గామన్ బ్రిడిపై వారం రోజులపాటు వార్షిక మరమ్మతులు నిర్వహించనున్నట్టు టోల్‌ప్లాజా మేనేజర్ రాజీవ్ సింగ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు వైపు వచ్చే దారిలో రెండు వైపులా వచ్చే వాహనాలను అనుమతిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ పనులు ఈ నెల 14 వరకు జరుగుతాయన్నారు. ఒకవేళ ఆ తేదీకి పూర్తికాని పక్షంలో మరి కొన్ని రోజులు మూసివేతను పొడిగిస్తామని, దీనికి వాహనదారులు సహకరించాలని కోరారు.

పోలీసుల అదుపులో అత్యాచార నిందితుడు

కరప, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కూతురు వరసైన యువతిపై అత్యాచారం చేసి పరారైన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాకినాడ జిల్లా కరప మండలం వేళంగికి చెందిన మండాది అమ్మాజీ చనిపోయిన తన సోదరి కుమార్తెను చేర దీసి తన ఇంట్లో ఉంచుకుంది. వావివరసలు మరిచిన అమ్మాజీ భర్త శ్రీనివాసు ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆ యువతిని అత్యాచారం చేసి పరారైన విషయం తెలిసిందే. దీనిపై అత్యాచారం కేసు నమోదు చేసిన కరప పోలీసులు శనివారం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. మరోపక్క బాధితురాలికి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతుందని వారు చెప్పారు.

ఔషధాల చేప రూ.70వేలు

అంతర్వేది, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెం మలినీ ఫిషింగ్ హార్బరులో మత్స్యకారుల వేటలో వలకు చిక్కిన కచిడీ చేప శనివారం వేలం పాట నిర్వహించారు. రూ.70వేలు ధర పలికిన ఈ కచిడీ ఆడ చేప కంటే మొగ చేప అయితే 3 రెట్లు ధర పలుకుతుందని కొనుగోలుదారులు అన్నారు. ఈ చేప పొట్ట భాగాన్ని ఔషధాలకు వినియోగిస్తారని తెలిపారు.



వేలం పాటలో ఉంచిన కచిడీ చేప

స్నేహితులతో కలిసి గోదావరిలో

స్నానానికి దిగి యువకుడి మృతి

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): గోదావరి నదిలో స్నానానికి దిగిన యువకుడు మృతిచెందిన సంఘటన శనివారం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం కేదార్లంకలో జరిగింది. పోలీసులు, రెవెన్యూ అధికారుల వివరాల ప్రకారం.. కొత్తపేట మార్కెట్ వీధికి చెందిన రొట్టా దుర్గాప్రసాద్(21) మరో నలుగురు స్నేహితులతో కలిసి కేదార్లంక ఇసుకర్యాంపు సమీపంలో గోదావరిలో స్నానానికి దిగి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న రెవెన్యూ, పోలీసులు అధికారులు నదిలో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. మిగిలిన నలుగురు బయటపడారు. కేదార్లంక ర్యాంపు వద్ద విచ్చలవిడిగా ఇసుక తవ్వేయడం వల్ల ఏర్పడ్డ గుంతల్లో దుర్గాప్రసాద్ గల్లంతై చనిపోయాడని ఆరోపిస్తూ కొత్తపేటకు చెందిన కుటుంబీకులు, బంధువులు మృతదేహం వద్ద ధర్నా నిర్వహించారు. న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. సంఘటనా స్థలాన్ని మండపేట సీఐ దొరరాజు, అంగర ఎస్ఐ రవికుమార్, గ్రామ వీఆర్వో వెంకటేశ్వరరావు పరిశీలించారు. ధర్నా చేస్తున్న బాధిత కుటుంబీకులు, బంధువులతో చర్చలు జరిపారు.



కేదార్లంకలో గోదావరి నుంచి దుర్గాప్రసాద్ మృతదేహాన్ని బయటకు తీసుకువస్తున్న దృశ్యం

పింఛను సొమ్ములు దుర్వినియోగం

సొంతానికి వాడుకున్న పెనుమళ్ల వెల్ఫేర్ అసిస్టెంట్

పోలీసులకు ఫిర్యాదు చేసిన ఎంపీడీవో

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన విషయం

కరప, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు మండలం పెనుమళ్ల గ్రామంలో వెల్ఫేర్ అసిస్టెంట్ పింఛను సొమ్ములను దుర్వినియోగం చేసిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. గ్రామంలోని లబ్ధిదారులకు పింఛను అందించడానికి వెల్ఫేర్ అసిస్టెంట్ ధనరాజు ఈ నెల 1వ తేదీన రూ.2.24లక్షల నగదు తీసుకున్నాడు. అయితే ఆ సొమ్ములను పింఛనుదారులకు పంపిణీ చేయకుండా సొంతానికి వాడుకున్నట్టు తెలిసింది. విషయం బయటకు పొక్కకుండా కొంతమంది స్థానిక నాయకులు ప్రయత్నించినా పింఛనుదారుల ఆందోళనతో కాజులూరు ఎంపీడీవో రాంబాబు గొల్లపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని పై స్థానిక సచివాలయ కార్యదర్శి జలాల్‌ను వివరణ కోరగా పింఛను సొమ్ము దుర్వినియోగం వాస్తవమేనన్నారు. అయితే ఈనెల 3వ తేదీ రాత్రి ఎస్ఐ సమక్షంలో వెల్ఫేర్ అసిస్టెంట్ కొంత నగదును తిరిగి చెల్లించారని, వాటిని పింఛనుదారులకు పంపిణీచేయడం కూడా జరిగిందని వివరించారు. అందుబాటులో లేక పింఛన్లు తీసుకోని లబ్ధిదారుల సొమ్ము ఇంకా రూ.38వేలు వెల్ఫేర్ అసిస్టెంట్ వద్ద ఉందని, శనివారం సెలవు కావడంతో సోమవారం చెల్లించేలా అతడి వద్ద నుంచి రాతపూర్వక హామీ తీసుకున్నట్టు కార్యదర్శి పేర్కొన్నారు.

భార్య కాపురానికి రాకపోవడంతో భర్త అదృశ్యం



వీరాంజనేయులు

కిర్లంపూడి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యంపై శనివారం కాకినాడ జిల్లా కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడకు చెందిన ఓ.వీరాంజనేయులతో కిర్లంపూడి మండలం జగపతినగరం గ్రామానికి చెందిన కసిరెడ్డి శివరామకృష్ణ కుమార్తె గనిలక్ష్మితో వివాహమైంది. వారికి ఒక కుమారుడు ఉన్నాడు. గత కొంతకాలంగా వీరాంజనేయులు, భార్య గొడవలు పడుతున్నారు. ఈనెల 4వతేదీన వీరాంజనేయులు కిర్లంపూడిలోని అత్తగారింటికి వచ్చి భార్యను కాపురానికి రమ్మని అడగ్గా తాను రానని చెప్పడంతో గొడవ పెద్ద మనుషుల మధ్య పెట్టారు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో వీరాంజనేయులు అక్కడి నుంచి వెళ్లిపోయాడు. అయితే వీరాంజనేయులు కాకినాడ రాకుండా కనపడకుండా పోయినట్టు అతడి తల్లి రాజేశ్వరి కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వీరాంజనేయులు ఆచూకీ తెలిసిన వారు జగ్గంపేట సీఐ 9440796529, 9440904834 నెంబర్లలో తెలియజేయాలని కోరారు.

పిడుగుపాటుకు గేదె మృతి



కోటనందూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు గేదె మృతిచెందిన ఘటన కాకినాడ జిల్లా కోటనందూరు మండలం ఎల్‌డిపేట గ్రామంలో జరిగింది. శనివారం భారీ వర్షం కురిసి పిడుగుపడగా పొలంలో ఉన్న నెర్సిపూడి గంగరాజుకు చెందిన గేదె చనిపోయింది.

అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

జనసేన నేతలకు తప్పిన ప్రమాదం

శంఖవరం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తుని నుంచి చేబ్రోలు వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. స్థానికుల వివరాల ప్రకారం.. తుని చెందిన జనసేన నేతలు చేబ్రోలులో ఎమ్మెల్సీ నాగబాబు పర్యటనకు హాజరయ్యేందుకు వెళ్తుండగా కత్తిపూడి శివార్లలో కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని పొలాల్లోకి దూసుకెళ్లింది. ఎవరికీ గాయాలు కాలేదు. విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడండి

మామిడికుదురు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బాలబాలాజీ సన్నిధికి వచ్చే భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చూడాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచించారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. పార్టీ నాయకులు మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజా పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు విజయవాడకు చెందిన కూనపురెడ్డి శ్రీనివాసరావు, దీప్తి దంపతులు రూ.1,00,116 విరాళాన్ని శనివారం ఆలయ సూపరింటెండెంట్ కటారి శ్రీనివాసరాజుకు అందించారు. దాత కుటుంబ సభ్యులకు స్వామి చిత్రపటం, ప్రసాదం ఇచ్చారు.

సాధికారిక సభ్యుల నియామకాన్ని పూర్తిచేయండి

ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

ముమ్మిడివరం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కుటుంబ సాధికారిక సభ్యుల నియామకాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. ముమ్మిడివరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అర్థాని శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం సాయంత్రం జరిగిన నియోజకవర్గ సమన్వయకమిటీ సమావేశంలో ఎమ్మెల్యే బుచ్చిబాబు ముఖ్య అతిథిగా మాట్లాడారు. 30మంది పార్టీ సభ్యులకు ఒక సాధికారిక సభ్యున్ని నియమించాలని, ఈప్రక్రియ త్వరితగతిన పూర్తిచేసి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవాలని ఆయన సూచించారు. పార్టీ సభ్యత్వాల నమోదులో తెలుగుదేశం పార్టీ కోటి సభ్యత్వాలను దాటి దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో 46వేల సభ్యత్వాలను పూర్తిచేసి సభ్యులకు సభ్యత్వ కార్డు అందజేశామన్నారు. పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మరణాన్ని రాజకీయ లబ్ధికి వాడుకుంటున్నారని, ఇటువంటి దుష్ప్రచారాలను నాయకులు తిప్పి కొట్టాలన్నారు. రాజధాని అమరావతి నిర్మాణానికి టెండర్లు పిలిచారని, దీంతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసేందుకు సీఎం చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచిందని, కేంద్ర సహకారంతో పవన్‌కల్యాణ్, చంద్రబాబునాయుడు రాష్ట్రానికి ఎక్కువ నిధులు తీసుకువచ్చి రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. దీనికి ముందు బాబూజగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, నాగిడి నాగేశ్వరరావు, గొలకోటి దొరబాబు, తాడి నరసింహారావు, పొద్దోకు నారాయణరావు, దొమ్మేటి రమణకుమార్, టేకుమూడి లక్ష్మణరావు, వాడ్రేవు వీరబాబు, కాకర్లపూడి రాజేష్, ఆకాశం శ్రీనివాస్, దాట్ల బాబు, సాగి సూరిబాబురాజు, దూళిపూడి బాబి, మోహూరి వెంకటేశ్వరరావు, కట్టా త్రిమూర్తులు, చిక్కాల అంజిబాబు, గొల్లపల్లి గోపి, అడబాల సతీష్‌కుమార్, కడలి నాగు, కట్టా సత్తిబాబు, మెండి కమల, బొక్కా రుక్మిణి, వాసంశెట్టి అమ్మాజీ, ముమ్మిడివరపు వరలక్ష్మి, అత్తిలి ప్రసన్న, కుడుపూడి మల్లేశ్వరి, గోదశి గణేష్, జనిపల్లి సత్యనారాయణ, సరిపల్లి శ్రీనివాసరాజు, సానబోయిన సోమన్న, రెడ్డి శ్రీను, పాయసం చిన్నీ, కాకి మాణిక్యం, దాట్ల బాబుపాల్గొన్నారు.

ఓఎన్జీసీ టెర్మినల్ వద్ద గ్రామస్తులు, కూటమి నేతల ధర్నా



ఓడలరేవు ఓఎన్జీసీ టెర్మినల్ వద్ద గ్రామస్తులు, కూటమినేతల ధర్నా దృశ్యం

అల్లవరం ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): 35ఏళ్లగా ఓడలరేవు నుంచి భారీస్థాయిలో చమురు, సహజవాయు నిక్షేపాలు తరలించుకుపోతున్నా ఓడలరేవు గ్రామాభివృద్ధి పట్ల ఓఎన్జీసీ అధికారుల వైఖరిని నిరసిస్తూ టెర్మినల్ ప్లాంటు గేటు వద్ద శనివారం గ్రామస్తులు, కూటమి నేతలు ధర్నా చేసి నిరసన తెలిపారు. ఓఎన్జీసీ అధికారులు ఆర్డీవో కార్యాలయంలో చర్చల్లో వారం రోజులు గడువు కోరినా పట్టించుకోలేదంటూ అధికారుల తీరుపై మండిపడ్డారు. ఓడలరేవు గ్రామాన్ని దత్తత తీసుకోవాలని స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, కొల్లు విష్ణుమూర్తి, నాతి లెనిన్‌బాబు, కొప్పాడి వెంకటరామకృష్ణారావు, గుండుమేను శ్రీను, సోమాని వెంకటరమణ, కొల్లు త్రిమూర్తులు, పెమ్మాని వెంకటరామారావు, ఏసుబాబు, జనసేన నాయకులు గుర్రం కృష్ణ, కామాడి గంగాభవానీ, నల్లా రాము, టీడీపీ నేతలు ఈసకోను సాంబశివ, బొర్రా రాజేష్ తదితరులు ధర్నా చేసి నిరసన తెలిపారు. ఓడలరేవు గ్రామాన్ని దత్తత తీసుకుని గ్రామస్తుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని దెందుకూరి సత్తిబాబురాజుతో పాటు కూటమి నేతలు పేర్కొన్నారు. మార్చి27న ఆర్డీవో కార్యాలయంలో జరిగిన చర్చల్లో వారం రోజులు గడువు కోరిన ఓఎన్జీసీ అధికారులు కాలయాపన చేశారని విలేకరుల సమావేశం ఆరోపించారు. ఓఎన్జీసీ అధికారులు రెండు రోజుల్లోగా దిగి వచ్చి న్యాయం చేయకుంటే ఓఎన్జీసీ టెర్మినల్ పనులను స్తంభింపచేస్తామని గ్రామస్తులు, కూటమి నేతలు హెచ్చరించారు.

ప్రవీణ్ పడగాల మృతిపై విచారణ చేపట్టండి



యానాం శాంతి ర్యాలీలో పాల్గొన్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి, పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు

యానాం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పడగాల మృతిపై న్యాయ విచారణ చేయాలని డిమాండ్ చేస్తూ యానాం, తాళ్లరేవు పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో యానాంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. యానాం పాత బస్టాండ్ నుంచి యానాం పరిపాలనాధికారి కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీలో వందలాది మంది క్రైస్తవులు పాల్గొన్నారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక మల్లాడి కృష్ణారావు ర్యాలీలో పాల్గొని వారికి సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా మల్లాడి మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం దర్యాప్తు చేపట్టి, జరిగిన ఘటనలో కుట్ర ఉంటే దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. క్రైస్తవులు ర్యాలీగా పరిపాలనాధికారి కార్యాలయానికి చేరుకుని ఇన్‌చార్జ్ ఆర్ఏకు వినతిపత్రం అందజేశారు. యానాం, తాళ్లరేవు పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

కవి చంద్రశేఖర్‌కు ప్రశంసాపత్రం

రాజోలు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పొన్నమండకు చెందిన కవి గంటి చంద్రశేఖర్‌కు ఇటీవల ఉగాదికి, శ్రీరామనవమి సందర్భంగా తెలుగు వెలుగు సాహిత్య జాతీయవేదిక అంతర్జాల వేదిక ద్వారా నిర్వహించిన కవి సమ్మేళనంలో జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ కవిసమ్మేళనంలో విశ్వావసుసంవత్సర ప్రాధాన్యతపై శ్రీరాముడే ఆనాటి యుగం నుంచి ఆధునిక యుగం వరకు నేటి, నాటి తరాల వరకు ఆయన గుణగణాలే ఆదర్శమని, రాముడే కుటుంబ వ్యవస్థకు మార్గదర్శకుడని కవితాగానం చేసినందుకు జ్ఞాపికను అందజేసినట్టు తెలిపారు.చంద్రశేఖర్‌కు మాజీఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా అభినందించారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

- ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు
- బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి







అమలాపురం: పేరూరులో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, మామిడికుదురులో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, మలికిపురం: బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దేవవరప్రసాద్

అమలాపురం రూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఓటమి ఎరుగని రాజకీయ నేతగా 50ఏళ్ల పాటు పార్లమెంటేరియన్‌గా పనిచేసిన ఘనత డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్‌కు దక్కుతుందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, బలహీనవర్గాల ఆశాజ్యోతిగా ఆయన నిలిచిపోతారని కొనియాడారు. పేరూరులో శనివారం ఆకుమర్తి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, సర్పంచ్ దాసరి అరుణ, మంధా పణికుమార్, దేవరపల్లి వీరేష్‌కుమార్, ఎంపీటీ సత్యనారాయణ, కుడుపూడి సత్యనారాయణ, జల్లి శ్రీనివాసరావు, దాసరి డేవిడ్ పాల్గొన్నారు. నడిపూడి డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ కల్యాణ మండపం వద్ద జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఊటాల వెంకటేష్, నెల్లి వెంకటేశ్వరరావు, మోకా శ్రీనివాసరావు, బొక్కా నాని, రాయుడు ప్రసాద్, రావూరి రాంబాబు తదితరులు పాల్గొని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మోకాటి నాగేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి, రాజమహేంద్రవరం సబ్‌రిజిస్ట్రార్ రాయి రాంబాబు, పంచాయతీరాజ్ డీఈ పీఎస్ రాజ్‌కుమార్, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావులు ముఖ్య అతిథులుగా హాజరై జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. జిల్లా విజిలెన్స్ అండ్‌ఎన్‌ఫోర్స్‌మెంట్ మోనటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమితులైన మోకాటి నాగేశ్వరరావు, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ చైర్మన్‌గా నియమితులైన మడికి శ్రీరాములను సొసైటీ తరఫున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధికారి బాబ్జి, యార్లగడ్డ రవీంద్ర, పెద్దిరెడ్డి రాము, పొలమూరి ధర్మపాల్, కాప నాగభూషణం, చాట్ల సత్యనారాయణ, నూటుకుర్తి మూర్తి తదితరులు పాల్గొన్నారు. బండారులంక పంచాయతీ కార్యాలయం వద్ద శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, మాదిగ యువజన సంఘం ఆధ్వర్యంలో పలువురు నాయకులు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సర్పంచ్ పెనుమాల సునీత, దండోరా నాయకులు ఉందుర్తి జీవరత్నం, ఈతకోట రాజేష్, జొన్నాడ నాగరాజు, తొత్తరమూడి మురుగులమ్మతో పాటు మాడామాధవి, బండి మణికంఠ, కడలి వెంకటేశ్వరరావు, కాశిన బాబి పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ప్రకటించాలి

దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడడంతో పాటు అట్టడుగువర్గాల అభ్యున్నతికి జీవితకాలం పోరాడిన డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్‌కు భారతరత్న ప్రకటించకపోవడం విచారకరమని ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణ, బొమ్మి ఇజ్రాయిల్ పేర్కొన్నారు. మాదిగల పొలిటికల్ జేఏసీ, బాబూజగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ అసోసియేషన్, మాదిగల ఎంప్లాయీస్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎమ్మెల్సీలతో పాటు పలువురు నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. అందరికీ స్వీట్లు పంచారు. బాణసంచా కాల్చారు. అమలాపురంలో జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, చెల్లుబోయిన శ్రీనివాసరావు, పందిరి శ్రీహరి, సంసాని బులినాని, తిక్కిరెడ్డి వెంకటేష్, మడికి శ్రీరాములు, మడికి సత్యనారాయణ, యార్లగడ్డ రవీంద్ర, జాన్‌వెల్లీ, షేక్ ఖాదర్ పాల్గొన్నారు. ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు మోకా వెంకటసుబ్బారావు, చింతలపూడి సత్తిబాబు, మేడిచర్ల త్రిమూర్తులు, రాయుడు నాని, మానే ప్రకాష్ పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): బాబూజగ్జీవన్‌రామ్ బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి అని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కొనియాడారు. మామిడికుదురు బస్టాండు కూడలిలో ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలువేసి నివాళులర్పించారు. భారత ఉప ప్రధానిగా ఆయనచేసిన సేవలను కొనియాడారు. మాజీ జడ్పీ చైర్మన్ నామన రాంబాబు, ఎమ్మార్పీఎస్ నాయకులు నూటుకుర్తి సత్యనారాయణ, చుట్టుగుళ్ల కిశోర్, శెట్టిం రమేష్, చాట్ల సత్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): లక్కవరం అరుంధతిపేటలో శనివారం నిర్వహించిన బాబూజగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. జగ్జీవన్‌రామ్‌కు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ నివాళులర్పించారు. కుల రహిత సమాజం కోసం బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం జగ్జీవన్‌రామ్ పనిచేశారన్నారు. కార్యక్రమంలో కోట పుష్పకుమారి, ముదునూరి చినబాబు, మంగెన నాని, దిరిశాల బాలాజీ, మంగెన వెంకటనరసింహరావు, చెల్లుబోయిన హెలీన, దిరిశాల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): దేశ మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ 117వ జయంతిని ముమ్మిడివరంలో పలు రాజకీయ పార్టీలు, పలు సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా శనివారం నిర్వహించారు. పోలమ్మచెరువుగట్టున ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఆయన అందించిన సేవలను పలువురు కొనియాడారు. అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ, అభ్యుదయ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమంలో వడ్డి నాగేశ్వరరావు, దోనిపాటి ఆంజనేయులు, మట్టా శ్రీను, జనిపల్లి సత్యనారాయణ, నందిక ధనరాజు, కాశి సింహాద్రి, కాశి వెంకటాచార్యులు పాల్గొన్నారు. షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం మండలశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాట్టా శ్రీనివాసరావు, కాశి వెంకటాచార్య, జనిపల్లి సత్యనారాయణ, చికిలే తిరుపతిరావు, వైచిట్టిబాబు, మోర్త రాజశేఖర్, బుడితి వెంకటేశ్వర్లు, వీరాస్వామి పాల్గొన్నారు. జనసేన పార్టీ ముమ్మిడివరం నియోజకవర్గం ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గుద్దటి జమ్మి, దూడల స్వామి, అత్తిలి బాబూరావు, మోకా బాలప్రసాద్, మద్దింశెట్టి పురుషోత్తం, సవరపు వెంకట్, యలమంచిలి బాలరాజు, కర్రా దుర్గాప్రసాద్, లంకలపల్లి జమి, కొప్పిశెట్టి గణేష్, చోడిశెట్టి నాగు, బద్రి రమా, గాలిదేవర బుల్లి, వంగా సీతారామ్, సలాది రాజా, గొలకోటి ఫణి, రాచకొండ శ్రీను పాల్గొన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యాలయంలో ఎస్ఎన్ మునీశ్వరరావు ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుత్తుల శివశంకర్, లోకినీడి వెంకటేశ్వరరావు, కర్రి రాంబాబు, కడలి రాంపండు, మోర్త రాజశేఖర్, ఎస్.చిన్నీ, చిన్నారావు, యలమంచిలి బాలరాజులతో పాటు పలువురు పాల్గొని నివాళులర్పించారు.

అయినవిల్లి, (ఆంధ్రజ్యోతి): మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ 117వ జయంతి సందర్భంగా శనివారం మండలంలో బాబూజగ్జీవన్‌రామ్‌కు ఘనంగా నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. తొత్తరమూడిలో బాబూజగ్జీవన్‌రామ్ శిలా విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్బారావు, జనసేన మండలాధ్యక్షుడు పోలిశెట్టి రాజేష్, టీడీపీ మండలాధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, బిక్కిన బాబి, పెండ్ర రమేష్, వారా లక్ష్మీనరసింహరామ్, నేదునూరి నాని, తొత్తరమూడి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన సంఘ సంస్కర్త, అణగారిన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ అని గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అన్నారు. తాటిపాకలో ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయంలో శనివారం జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. నేటి యువత జగ్జీవన్‌రామ్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈఈ సుందరసింగ్, కడలి నీటిసంఘం అధ్యక్షుడు గాలిదేవర వెంకన్నబాబు, ఉపాధ్యక్షుడు ఆకుమర్తి వెంకటేశ్వరరావు, కడలి నాగరాజు, బడుగు శ్రీనివాస్, కట్టా శ్రీనివాస్, కడలి మోహన్ పాల్గొన్నారు. రాజోలు తెన్నేటి నగర్‌లో బాబూజగ్జీవన్‌రామ్ జయంతిని మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, రాష్ట్ర ఎమ్మార్పీఎస్ఎస్ అధ్యక్షుడు తేన్నేటి కిశోర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ రేవు జ్యోతి, ఎంపీటీసీ చెల్లింగి లక్ష్మీశ్వరి పాల్గొన్నారు. రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, డాక్టర్ బోస్, ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం, (ఆంధ్రజ్యోతి): మురమళ్ళ మార్కెట్ సెంటర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మురమళ్ళ జగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ సొసైటీ, చెయ్యేటివారిపేట యువకుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, నడిపల్లి సూర్యవర్మ, సర్పంచ్ కాలే రాజబాబు, జనసేన నాయకుడు గుద్దటి జమ్మి, గాదిరాజు బుచ్చికృష్ణంరాజు, పెన్మెత్స వాసురాజు, చెయ్యేటి శ్రీనుబాబు, ఇందుర్తి ఈశ్వరీబాయి, గంజా సుధాకర్, జొన్నాడ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): గోడి, బెండమూర్లంక, యెంట్రుకోన, కోడూరుపాడు, బోడసకుర్రు గ్రామాల్లో బాబూజగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, సర్పంచ్ తోట శ్రీదేవి, తోట నరసింహారావు, ఆకుమర్తి సాయిబాబు, సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, రొక్కాల నాగేశ్వరరావు పాల్గొని జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పించారు. గోడి బొమ్మిడివారిపేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయెల్ పూలమాలవేసి నివాళులర్పించారు.

యానాం, (ఆంధ్రజ్యోతి): బాబూజగ్జీవన్‌రామ్‌కు యానాంలో అధికారులు, నాయకులు ఘన నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ జయంతిని యానాం సమాచారశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక పెర్రీరోడ్డు, భీమనగర్ వద్ద గల జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు యానాం ఇన్‌చార్జ్ పరిపాలనాధికారి డాక్టర్ రవిశంకర్, ఎస్పీ రాజశేఖరన్, భీమనగర్ గ్రామస్తులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): మాజీ ఉపప్రధాని బాబూజగ్జీవన్‌రామ్ జయంతిని వాడవాడల నిర్వహించారు. అంబాజీపేట, కె.పెదపూడి గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. గంగలకుర్రు మలుపు వద్ద ఉన్న కముజువారిపేటలో వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస్ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, నాయకులు దాసరి సత్యనారాయణ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, బొంతు పెద బాబు, గణపతి వీరరాఘవులు, పెదపూడి శ్రీనివాసరావు, కొర్లపాటి గోపి, మైపాల తాతాజీ, పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, అరిగెల సూరిబాబు, ఉందుర్తి నాగబాబు, విత్తనాల శేఖర్, దొమ్మేటి సాయికృష్ణ పాల్గొన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం, సామాజిక సమానత్వం, బడుగుబలహీన వర్గాల కోసం పోరాడిన ఆదర్శ వ్యక్తి బాబూజగ్జీవన్‌రామ్ అని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కొనియాడారు. పి.గన్నవరం అక్విడెక్టు వద్ద, పార్టీ కార్యాలయంలో బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహానికి, చిత్రపటాలకు ఎమ్మెల్యే పూలమాలలువేసి నివాళులర్పించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కేవీ ప్రసాద్, విద్యుత్‌శాఖ కార్యాల యంలో జేఈ ఆచార్యులు జగ్జీవన్‌రావ్ చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సంసాని పెద్దిరాజు, బొండాడ నాగమణి, ఆది మూలం సూరయ్యకాపు, ఆకుమర్తి ఆశీర్వాదం, సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, యడ్ల ఏసు, రామకృష్ణ, తవిటికి బుజ్జి, కడలి శంకరం, తాటి కాయల శ్రీనివాసరావు, పితాని రాంబాబు పాల్గొన్నారు. పి.గన్నవరం అక్విడెక్టు వద్ద బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, పీకేరావు, మంద పాటి కిరణ్‌కుమార్, నక్కా వెంకటేశ్వర రావు, అడ్డగళ్ల వెంకటసాయిరాం, ఉలిశెట్టి బాబి, దొమ్మేటి వెంకటశివరామన్, పితాని నరసింహా రావు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కేకేసీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాబి



అమలాపురం టౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) అనుబంధ సంస్థ అయిన ఆంధ్రప్రదేశ్ అన్ రికగ్నైజ్డ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ కాంగ్రెస్ (కేకేసీ) రాష్ట్ర అధికార ప్రతినిధిగా అమలాపురం పట్టణానికి చెందిన వంటెద్దు బాబి నియమితులయ్యారు. ఈమేరకు ఆలిండియా కాంగ్రెస్ కమిటీ నుంచి నియామక ఉత్తర్వులు విడుదలయ్యాయి. కేకేసీ రాష్ట్ర చైర్మన్‌గా కాలెపు వెంకటకృష్ణారెడ్డితో పాటు ఆరుగురు సభ్యులతో రాష్ట్ర కమిటీని ప్రకటించగా అధికార ప్రతినిధిగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేస్తున్న బాబిని నియమించారు. సహకరించిన పీసీసీ అధ్యక్షుడు వైఎస్ షర్మిళ, ఏఐసీసీ ఆహ్వానకమిటీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, జిల్లా అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు, పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీనివాస్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బాబిని పలువురు అభినందించారు.

11న కలెక్టరేట్ వద్ద బీసీల రిజర్వేషన్ల కోసం నిరసన

అమలాపురం టౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిరావుపూలే జయంతిని పురస్కరించుకుని ఈనెల11న కలెక్టరేట్ వద్ద బీసీలకు 52శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్‌చేస్తూ ధర్నా నిర్వహించనున్నట్టు బహుజన సమాజ్ పార్టీ జిల్లా శాఖ అధ్యక్షుడు కుసుమ వెంకటేశ్వరరావు తెలిపారు. అమలాపురం ఎర్రవంతెన వద్దనున్న బీఎస్పీ కార్యాలయంలో వెంకటేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జ్యోతిరావుపూలే ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టరేట్ వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమాల పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి కాశి లక్ష్మీభవానీ, ఉపాధ్యక్షుడు వాకపల్లి బీమారావు, ప్రధాన కార్యదర్శి బూసి జాన్‌మోషే, గుర్రపు పొట్టియ్య, బడుగు వెంకటేశ్వరరావు, ఆకుమర్తి భూషణం, జేఎన్డీ రాజు, గంగరాజు, జనిపల్లి నాని, పరమట వెంకటశ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉమామల్లేశ్వరునికి పూర్ణాహుతి, ప్రత్యేక పూజలు

అల్లవరం ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): దేవగుప్తం ఉమామల్లేశ్వరాలయం వద్ద వేద పండితుల మంత్రోచ్చారణలు, భక్తుల శివనామస్మరణల మధ్య పూర్ణాహుతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. నక్షత్ర పూర్వక నవగ్రహ, శివపంచాయతన యాగ మహోత్సవాలు ముగియడంతో భక్తులు పోటెత్తి మల్లేశ్వరుడిని దర్శించుకున్నారు. మరువాడ వేంకటేశ్వరశర్మ పర్యవేక్షణలో పోచినపెద్ది నరసింహమూర్తి బ్రహ్మత్వాన పోచినపెద్ది శ్యామ్‌శర్మ ఆధ్వర్యంలో పూర్ణాహుతి, ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. పూర్ణాహుతి ద్రవ్యాలను సమర్పించి భక్తులు తన్మయత్వం పొందారు. శివాలయం వద్ద భారీ అన్నసమారాధన జరిగింది. మాజీ ఎంపీ చింతా అనురాధ, ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, సర్పంచ్ సాధనాల వెంకట్రావు, రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ తిరుమలరావు, దేవగుప్తం, అల్లవరం, డి.రావులపాలెం, సామంతకుర్రు గ్రామాల నుంచి ప్రజలు మల్లేశ్వరుడిని దర్శించుకున్నారు.

వంతెనను అందుబాటులోకి తీసుకురావాలి

మలికిపురం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): తూర్పుపాలెం వంతెనను అందుబాటులోకి తీసుకురావాలని ఇంజనీరింగ్ అధికారులకు, కాంట్రాక్టర్లకు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సూచించారు. గత టీడీపీ హయాంలో రూ.4.30కోట్లతో నిర్మించిన ఈవంతెన అప్రోచ్ రోడ్డు పూర్తికాకపోవడంతో అప్పటి నుంచి అలాగే మిగిలిపోయింది. దీంతో తూర్పుపాలెం గ్రామస్తులతో ఎమ్మెల్యే దేవ చర్చలు జరిపి వంతెన పనులకు మార్గం ఏర్పాటుచేశారు. శనివారం ఈవంతెన పనులను ఆయన పరిశీలించారు. అడబాల సాయిబాబు, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, దిరిశాల బాలాజీ, పినిశెట్టి బుజ్జి, సర్పంచ్ గుల్లింక సత్తిబాబు, మోటూరి సుబ్రహ్మణ్యం, డ్రైనేజీ డీఈ నాగార్జున పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బుచ్చిబాబు పరామర్శ

ముమ్మిడివరం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అనాతవరం గ్రామకమిటీ అధ్యక్షుడు కురసాల శివబాబు సోదరి సుబ్బలక్ష్మి గత నెల 24వ తేదీన మండపేటలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందారు. కురసాల శివబాబు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు శనివారం పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, మిమ్మితి చిరంజీవి, శీలం వెంకటేశ్వరరావు, శివరాజు, కుంచే శ్రీను, విళ్ల శ్రీను, వినకోట శ్రీను, బొక్కా సురేష్, మట్టపర్తి రాంబాబు, జనసేననాయకులు పాల్గొన్నారు.

ఎస్బీఐ సీఎస్సార్ నిధులతో కూలర్ల పంపిణీ



అమలాపురం టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): భారతీయ స్టేట్ బ్యాంక్ సీఎస్సార్ నిధులతో అమలాపురం శ్రీకామాక్షీ పీఠానికి వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకుని శనివారం నాలుగు ఏసీ కూలర్లతో పాటు ఆరు పెడస్టల్ ఫ్యాన్లు అందజేశారు. ఎస్బీఐ లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు స్వప్నబెన్ పాటిల్ చేతులమీదుగా కూలర్లతో పాటు గ్రైండర్, మిక్సీలను 50కు పైగా తలదిండ్లను, నిత్యావసర వస్తువులను అందజేశారు. ఎస్బీఐ తరపున తమవంతు సహాయంగా వీటిని అందించినట్టు ఆమె వివరించారు. డీజీఎం సంక్రిత్య మాట్లాడుతూ 50 ఏళ్లకు పైగా కామాక్షీ పీఠాన్ని నిర్వహిస్తూ వందలాది మంది అనాథలను చేరదీసి ఆశ్రయమిస్తున్న కామేశ మహర్షిని ప్రత్యేకంగా అభినందించారు. ఎస్బీఐ తరపున పీఠాధిపతి కామేశమహర్షితో పాటు ఆశ్రమ నిర్వాహకురాలు వక్కలంక వాణిలను ఘనంగా సత్కరించారు. సాయం అందించిన ఎస్బీఐ అధికారులతో పాటు సుష్మశ్రీవత్సవ్‌లకు ప్రేమమందిరం చిన్నారులు కృతజ్ఞతలు తెలిపారు.

బాలబాలాజీ స్వామి సన్నిధిలో భక్తుల పూజలు



మామిడికుదురు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం శనివారం భక్తుల కోలాహలంతో కిటకిటలాడింది. వేకువజాము నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. శనివారం పురస్కరించుకుని స్వామివారిని అర్చకులు వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి వేద మంత్రోచ్చారణల మధ్య సుప్రభాత సేవ నిర్వహించి తొలి హారతి ఇచ్చారు. భక్తులతో కొత్త, పాత ఆలయాలు కిటకిటలాడాయి. వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.2,20,146 ఆదాయం వచ్చిందని, స్వామివారిని 4వేల మంది భక్తులు దర్శించుకుని 2500మంది భక్తులు నిత్యాన్నదాన పథకంలో అన్నప్రసాదం స్వీకరించారని సహాయ కమిషనర్ తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

రేపు దత్తాత్రేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

ముమ్మిడివరం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలో శ్రీషిర్డిసాయి బాబా లెండీబాగ్‌లో డాక్టర్ నేమాని వీరవెంకటసత్యనారాయణమూర్తి-సూర్యకాంతం దంపతులతో నూతనంగా నిర్మింపబడిన శ్రీదత్తసాయి నిత్య అన్నప్రసాద నిలయంలో శ్రీగురుదత్తాత్రేయ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం సోమవారం జరగనుంది. సోమవారం ఉదయం 5గంటలకు కాకడహారతి, గణపతిపూజ, పంచామృత సుగంధ ద్రవ్యాభిషేకాలు, సహస్ర నామార్చన, పలు రకాల పుష్పాలు, పత్రాలతో బాబాకు విశిష్ట పూజలు, విశిష్ట సామూహిక పూజలు నిర్వహించనున్నారు.

ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ విజయారెడ్డి



విజయారెడ్డిని అభినందిస్తున్న దృశ్యం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పశు సంవర్ధకశాఖ సిబ్బంది పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం కాకినాడలో నిర్వహించారు. అమలాపురం పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుడిగా పనిచేస్తోన్న డాక్టర్ ఎల్.విజయారెడ్డిని జిల్లా ప్రధానకార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా విజయారెడ్డిని పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ ఆర్.వెంకటేశ్వరరావు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కె.వెంకట్రావు, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కర్నీడి మూర్తిలు అభినందించారు.

ఎమ్మెల్సీ నాగబాబును కలిసిన ఎమ్మెల్యే గిడ్డి



పి.గన్నవరం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా బాధ్యతలు స్వీకరించి మొదటిసారిగా పిఠాపురం వచ్చిన కొణిదెల నాగబాబును శనివారం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. నాగబాబును ఎమ్మెల్యే దుశ్శాలువాతో సన్మానించి అభినంధనలు తెలిపారు. అలాగే నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నాగబాబుకు ఎమ్మెల్యే వివరించారు.

శ్రీపెద్దింట్లమ్మ హుండీ ఆదాయం రూ.2,20,184

అంతర్వేది, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కేశవదాసుపాలెం చినకొల్లేరు మెండుపాలెంలో వెలసి ఉన్న శ్రీపెద్దింట్లమ్మవారి హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. తనిఖీ అధికారి రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో ప్రధాన హుండీ ఆదాయం రూ.2,07,568, కోటసత్తెమ్మవారి హుండీ ఆదాయం రూ.12,616, మొత్తం రూ.2,20,184 ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో ఉండపల్లి అంజి, మెండు శ్రీను, రెవెన్యూ, పోలీసు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతాప్‌కు మంత్రి దుర్గేష్ సత్కారం



అంతర్వేది, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి సీఎం చంద్రబాబునాయుడు నుంచి కళారత్న (హంస) పురస్కారం అందుకున్న ప్రముఖ కవి, రచయిత, శ్రీశ్రీకళావేదిక అంతర్జాతీయ సీఈవో కత్తిమండ ప్రతాప్‌ను పర్యాటక, సాంస్కృతిక, ఫొటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ సత్కరించారు. రాజమహేంద్రవరంలో జరిగిన కార్యక్రమంలో ప్రతాప్‌ను సత్కరించి ఫొటోఫ్రేమ్‌ను అందజేశారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

శ్రీరామనవమి వేడుకలకు ఏర్పాట్లు పూర్తి


రాయవరంలో నవమి ఏర్పాట్లు చేస్తున్న భక్తులు

రాయవరం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలు జరిపేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. వెదురుపాక విజయదుర్గా పీఠంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు శనివారం మాట్లాడుతూ పీఠం వేద పండితులతో ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. పీఠాధిపతి గాడ్ సమక్షంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తామన్నారు. అనంతరం గాడ్ భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగంతో పాటు సీతారాముల కల్యాణం విశిష్టత వివరిస్తారన్నారు. భక్తులకు ముత్యాల తలంబ్రాలు, ప్రసాదం పంపిణీ చేయడంతో పాటు అన్న సమారాధన నిర్వహిస్తామన్నారు. మండలంలోని ఆయా గ్రామా ల్లోని రామాలయాల వద్ద సీతారాముల కల్యాణం జరిపేందుకు ఆలయాల కమిటీలు, భక్తులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

నవమి ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

కపిలేశ్వరపురం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాలను శుభ్రం చేయడంతో పాటు చలువ పందిళ్లు వేసి ఆయా ఆలయాలను విద్యుద్దీపాలతో తీర్చిదిద్దారు. శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయా ఆలయాల కమిటీ, ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు.


అంగరలో శ్రీరామనవమి ఉత్సవాలకు జరుగుతున్న ఏర్పాట్లు

మడికి శివకేశవుల ఆలయ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే బండారు


మడికి శివాలయంలో సోమేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే బండారు

ఆలమూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మడికిలోని ఒకే ఆలయ ప్రాంగణంలోనున్న శివకేశవుల ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న బాలా త్రిపుర సుందరీదేవీ సమేత సోమేశ్వరస్వామి, నవజనార్దనస్వామి ఆలయాల్లో ఒకటైన శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామిలు ఉండటంతో పలు ప్రాంతాల భక్తులు వస్తుంటారని పలువురు తెలిపారు. పురాతన ఆలయం కావడంతో శిథిలావస్థకు చేరుతున్నదని స్థానికులన్నారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. ఆలయంలో ఆయన పూజలు చేశారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టైక్వాండో పోటీల్లో విద్యార్థి ప్రతిభ

ఆత్రేయపురం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా టైక్వాండో పోటీల్లో ఆత్రేయపురం మండలం ఉచ్చిలికి చెందిన తోటకూర నయన్‌వర్మ విశేష ప్రతిభ కనబరిచారు. ఆల్‌ఇండియా కరాటే టైక్వాండో, కుంగ్‌ఫూ పోటీలలో ఎల్లో బెల్ట్ వెపన్స్ కత్తి ప్రదర్శన విభాగంలో ప్రథమ స్థానం సాధించారు. ఈ సందర్భంగా శనివారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నయన్‌వర్మను అభినందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తోటకూర సుబ్బరాజు, వెత్సా వనిల్, కోచ్ లక్ష్మీసందీప్‌కిరణ్, గ్రాండ్ మాస్టర్ అబ్బులు తదితరులు పాల్గొన్నారు.


ఉచ్చిలికి చెందిన విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం


ప్రగతి నర్సింగ్ హోమ్ వద్ద ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించాలంటూ నిరసన తెలుపుతున్న వైద్యులు

ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించాలంటూ నిరసన

రావులపాలెం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): సకాలంలో ఆరోగ్యశ్రీ సేవల బకాయిలు చెల్లించకపోవడంతో శనివారం వైద్యులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. రావులపాలెం ప్రగతి నర్సింగ్ హోమ్ వద్ద డాక్టర్ బలరామరెడ్డి, డాక్టర్ సందీప్‌రెడ్డి, డాక్టర్ అనంతలక్ష్మి, ఆసుపత్రి సిబ్బంది నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు.

వాతావరణ మార్పులతో అన్నదాత ఆందోళన

రావులపాలెం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): వరి పంట చేతికి వచ్చేందుకు సిద్ధంగా ఉన్న తరుణంలో వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. రావులపాలెం మండలం శనివారం మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతమై తేలికపాటి ఈదురుగాలులు వీయడంతో రైతులు ఆవేదనకు గురయ్యారు. దాళ్వా సాగు చేసిన రైతులు అధిక పెట్టుబడులు పెట్టి పంటను సాగు చేశారు. మండల పరిధిలోని గ్రామాల్లో ప్రస్తుతం రబీ సీజన్‌లో రైతులు 1121, 126, 111తో పాటు పలు వంగడాలను సాగు చేశారు. వీటిలో 126, 111తో పాటు ముందుగా ఊడ్చిన వరి పొలాలు కోతకు సిద్ధమయ్యాయి. ఈ తరుణంలో వాతావరణంలో మార్పులు రావడంతో చేతికి అందివచ్చిన పంట ఏమి అవుతుందోనని రైతులు కలవర పడుతున్నారు.


రావులపాలెం మండలంలో మేఘావృతమైన ఆకాశం


ఆలమూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాండ్రేగులను సన్మానిస్తున్న దృశ్యం

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సత్కారం

ఆలమూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఆలమూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా ఎన్నికైన కాండ్రేగుల భీమ శంకరరావును ఆలమూరు శ్రీకృష్ణదేవరాయ కాపు సంఘం అధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. న్యాయవాదిగా ఆయన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో కాపు సంఘం మండల అధ్యక్షుడు చల్లా ప్రభాకరరావు, నాయకులు చల్లా నానాజీ, సీతామహాలక్ష్మి, శ్రీపతి సూర్యనారాయణ, డీపీ రావు, చల్లా వెంకటేశ్వరరావు, ఎస్.పట్టాబి, గందం చంద్రం, సామంతుల నానీ తదితరులు పాల్గొన్నారు.

1300 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ఆత్రేయపురం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం పేరవరం గోదావరి లంకలో శనివారం ఎక్సైజ్ పోలీసులు దాడులు చేశారు. సారా తయారీకి సిద్ధంగా ఉన్న 1300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ కాత్యాయని తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు కె.అన్నవరం, ఎన్.రామచంద్రం, సిబ్బంది పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు వెలకట్టలేనివి

• మంత్రి సుభాష్ • ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘన నివాళి


రామచంద్రపురం మండలం నరసాపురపుపేటలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న మంత్రి సుభాష్

ద్రాక్షారామ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): దేశానికి జగ్జీవన్‌రామ్ అందించిన సేవలు వెలకట్టలేనివని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. శనివారం జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని రామచంద్రపురం మండలంలో నరసాపురపుపేట, తాడిపల్లి, రామచంద్రపురం పట్టణంలో కాంప్లెక్సు వద్ద జరిగిన జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో మంత్రి సుభాష్ పాల్గొన్నారు. నరసాపురపుపేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం కేకు కోసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడారు. కార్యక్రమాల్లో నరసాపురపుపేట గ్రామ సర్పంచ్ చాట్రాది వీరలక్ష్మి, ద్రాక్షారామ కొత్తపల్లి అరుణ, ఎంఆర్‌పీఎస్ నాయకులు పైడిమల్ల అన్నవరం, బుంగ వెంకట్రావు, వీది ఆశీర్వాదం, బీజేపీ నాయకుడు పలివెల రాజు తదితరులతో పాటు టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాల రాఘవన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పట్టణ కార్యాలయంలో: రామచంద్రపురం టీడీపీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం నివాళులర్పించారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు. స్టీల్‌వెల్‌పేట, రాజబాబు నగర్‌లో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. ద్రాక్షారామ మార్కెట్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి సర్పంచ్ కొత్తపల్లి అరుణ నివాళులర్పించారు.

జాతి గర్వించేనేత జగ్జీవన్‌రామ్

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): భారత జాతి గర్వించేనేత జగ్జీవన్‌రామ్ అని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శనివారం మండలంలోని గంగవరం, పాణింగపల్లి, అముజూరు గ్రామాల్లో జరిగిన జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పి.నాగమణి జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు చిర్రా రాజ్ కుమార్, కూటమి నాయకులు అల్లూరి దొరబాబు, తాడాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు. కూళ్ల కరుణానగర్ కాలనీలో గ్రామ పెద్దలు ఏడుకొండలు, సుబ్బారావు, వార్డు సభ్యుడు మణి, రామలక్ష్మి, ఉపాధ్యాయుడు గుణవంతుడు, ప్రసాద్, యూత్ సభ్యులు తదితరులు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు.


రాయవరంలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

రాయవరం, (ఆంధ్రజ్యోతి): జగ్జీవన్‌రామ్ జయంతిని ఆయా గ్రామాల్లో శనివారం నిర్వహించారు. రాయవరం దళితపేటలో ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహానికి సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, దళిత పెద్దలు నివాళులర్పించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించి పలువురు నివాళులర్పించారు.

మడికిలో జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాల ఆవిష్కరణ

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం మడికిలో జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శనివారం ప్రారంభించారు. వారి సేవలను వక్తలు కొనియడారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఆలమూరు మండలం పెనికేరులో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నారాయుడు అధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పలువురు నివాళులర్పించారు.


ఆత్రేయపురం మండలం మెర్లపాలెంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. ఆయన విగ్రహాలకు పలువురు నివాళులర్పించారు. మెర్లపాలెంలో జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మర వీరరాఘవులు ఆధ్వర్యంలో జగజ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఘనంగా ఏర్పాట్లు నిర్వహించారు. కార్యక్రమంలో గంధం యాకోబు, ఎం.రాజు, కొమ్మర సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం జగ్జీవన్‌రామ్ జయంతిని జరిపారు. కపిలేశ్వరపురం సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో సర్పంచ్ సాకా శ్రీనివాస్, నాయకులు పువ్వల చిట్టిబాబు, నెక్కంటి శ్రీరాంజీ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో మల్లిపూడి శివకుమార్, సంఘ పెద్దలు పలివెల పెదవెంకట్రావు, కొమ్ము సతీష్ తదితరులతో పాటు, మాదిగ సేవా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతిని జరిపారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మండపేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

నేటి యువతకు జగ్జీవన్‌రామ్ స్ఫూర్తి

ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట, (ఆంధ్రజ్యోతి): నేటి యువత జగ్జీవన్‌రామ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన స్థానిక కూటమి నేతలు, దళిత నేతలతో కలిసి ఆయన ఎస్సీ కాలనీలో వున్న జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. వైసీపీ నేతలు మున్సిపల్ చైర్‌పర్సన్ పి.నూక దుర్గారాణి, వేగుళ్ల పట్టాభి రామయ్యచౌదరి, రెడ్డి రాధాకృష్ణతో పాటు పలువురు నేతలు, నివాళులర్పించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ జయంతిని జరిపారు. అర్తమూరులో ఉపసర్పంచ్ కర్రి జంబయ్య సారథ్యంలో స్థానిక కూటమి నేతలు, జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. ఏడిదలో పలివెల సుధాకర్ నేతృత్వంలో జయంతిని జరిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దూలి జయరాజు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి దొరబాబు, స్థానిక నేతలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో : జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు సారథ్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు.

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. ప్రభుత్వ కళాశాలలో ఆయా ప్రిన్సిపాల్స్ ఆ్వర్యంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పలువురు నివాళులర్పించారు. ప్రజా ప్రతినిధులు ఆయా గ్రామాల్లో జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించారు.

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శనివారం నెల్లిపేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, బి. భాస్కరరావు, శిల్పి రాజకుమార్ వడయార్ తదితరులతో పాటు, కూటమి నాయకులు పాల్గొన్నారు. బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ కోటిపల్లి దామోదర్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కోటిపల్లి సుబ్రహ్మణ్యం, భమిడిపాటి లక్ష్మీనారాయణ, కుడుపూడి దావీదు, యు.ప్రసాదరాజు, అన్యం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


కపిలేశ్వరపురంలో జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం


ఆలమూరు మండలం మడికిలో జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు



కె.గంగవరం మండల పరిషత్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


భీమేశ్వరాలయంలో పూజలు చేస్తున్న జిల్లా జడ్జి గంధం సునీత

భీమేశ్వరాలయంలో జిల్లా జడ్జి పూజలు

ద్రాక్షారామ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని శనివారం ఉమ్మడి జిల్లా జడ్జి గంధం సునీత దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దర్శనం అనంతరం వేద పండితుల ఆశీర్వచనం తీసుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అల్లు వెంకట దుర్గాభవాని జడ్జికి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు. జిల్లా జడ్జి వెంట రామచంద్రపురం జడ్జి ఎన్.శారద ఉన్నారు.

నెలాఖరు వరకు పోలీస్ యాక్టు అమలు


ఎస్ఐ రవికుమార్

కపిలేశ్వర పురం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): నెలాఖరు వరకు పోలీస్ యాక్టు అమలులో ఉంటుందని అంగర ఎస్ఐ రవికుమార్ తెలిపారు. అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించరాదని ఆయన తెలిపారు. రామచంద్రపురం సబ్ డివిజన్ పరిధిలో సెక్షన్ 30 పోలీస్‌యాక్ట్ అమలులో ఉన్నందున సభలు, ఊరేగింపులు జరపరాదన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. మండపేట రూరల్ సీఐ దొరరాజు పర్యవేక్షణలో సెక్షన్ 30 అమలులో ఉంటుందని ప్రజలు గమనించాలన్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు విజయవాడకు చెందిన కూనపురెడ్డి శ్రీనివాసరావు, దీప్తి దంపతులు రూ.1,00,116 విరాళాన్ని శనివారం ఆలయ సూపరింటెండెంట్ కటారి శ్రీనివాసరాజుకు అందించారు. దాత కుటుంబ సభ్యులకు స్వామి చిత్రపటం, ప్రసాదం ఇచ్చారు.

తడి,పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన


తడి,పొడి చెత్తలను పరిశీలిస్తున్న డీఎల్‌డీవో రాజు

ఆలమూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తడి,పొడి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్న లక్ష్యం రామచంద్రపురం డివిజన్‌లో రెండు నెలలుగా యజ్ఞంలా సాగుతోంది. రామచంద్రపురం డివిజన్ పరిధిలో రామచంద్రపురం, మండపేట, కొత్తపేట నియోజకవర్గాలకు సంబంధించిన తొమ్మిది మండలాలు ఉన్నాయి. ఈ మండలాలలో 151 పంచాయతీ ఉన్నాయి. మొదటి విడతగా ఐవీఆర్ఎస్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెఎస్పాన్స్ సిస్టమ్)కు 65 గ్రామాలను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఎంపిక చేసిన పంచాయతీల్లో తడి,పొడి చెత్త సేకరణ విధానాన్ని పరిశీలించి ఆయా గ్రామాల్లో తడి,పొడి చెత్త సేకరణకు సంబంధించి ఇంటింటికి అవగాహన కల్పించే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా పంచాయతీకి అదనపు ఆదాయంపై చర్యలు తీసుకుంటున్నారు. పంచాయతీలకు పారిశుధ్య కార్మికులను అదనంగా ఏర్పాటు చేసుకోవడానికి వనరులు ఏర్పడతాయని పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచ్‌లు, పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పించారు.

ప్రజల నుంచి నేరుగా అభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు : ఐవీఆర్ఎస్‌కు ఎంపిక చేసిన గ్రామాల్లో ఈ సిస్టమ్ ద్వారా ప్రభుత్వం నేరుగా ఆయా ఇంటి యజమానులకు ఫోన్ చేసి ప్రజాభిప్రాయ సేకరణ తీసుకునే ఏర్పాట్లు జరుగుతున్నాయి. గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ ఏవిధంగా జరుగుతుంది, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పని తీరు ఎలా ఉందనే అంశాలను ప్రభుత్వం నేరుగా ప్రజల అభిప్రాయాలను సేకరించనున్నారు. చెత్త సేకరణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సంబంధిత పంచాయతీ కార్యదర్శుల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజలను చైతన్యవంతులను చేయడానికి అధికారులు శ్రమిస్తున్నారు.

చెత్త సేకరణలో ఇబ్బందులు: చెత్తను తడి, పొడిగా సేకరణ చేయడానికి ఉన్న కొద్దిపాటి పంచాయతీ పారిశుధ్య కార్మికులతో చేయడం ఇబ్బందిగా మారింది. ఐవీఆర్ఎస్ పథకం ద్వారా ఎంపిక చేసిన గ్రామాల్లో తడిపొడి చెత్తలను సేకరించి వాటిని సేకరణ కేంద్రాలలో విడదీసి వాటిని సంపదగా చేయడానికి అధిక శ్రమపడాల్సి వస్తున్నది. దీంతో ఉన్న సిబ్బంది చాలక పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీలకు ఉన్న కొద్దిపాటి ఆదాయంతో పారిశుధ్య కార్యక్రమానికే అధిక నిధులు కేటాయింపు చేయాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెత్తద్వారా సంపద సృష్టి

ఎ.రాజు, డీఎల్‌డీవో రామచంద్రపురం డివిజన్

చెత్తసేకరణ ద్వారా సంపద సృష్టించి పంచాయతీలకు అదనపు ఆదాయం లభిస్తుంది. ఐవీఆర్ఎస్ గ్రామాలుగా ఎంపిక చేసిన చోట పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఇబ్బందులు ఉన్నాయి. అయితే వాటిని అధిక మించి చెత్త సేకరణ జరుగుతుంది. భవిష్యత్‌గా ఆదాయం పెరుగుతుంది. దీంతో పంచాయతీకు ఆర్థిక ఇబ్బందులు ఉండవు. ముఖ్యంగా పంచాయతీలు ఈ గ్రామాలలో అదనపు సిబ్బందిని నియమించుకునే విధంగా జిల్లా కలెక్టర్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు.



151 బియ్యపు గింజలపై శ్రీరామ అష్టకం రచించిన దృశ్యం

151 బియ్యం గింజలపై శ్రీరామ అష్టకం


పెద్దింటి కృష్ణవంశీ

కొత్తపేట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమిని పురస్కరించుకుని కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన పెద్దింటి కృష్ణవంశీ 151 బియ్యం గింజలపై శ్రీరామ అష్టకం రచించి భక్తిని చాటుకున్నారు. దీన్ని లిఖించడానికి సుమారు 2 గంటల సమయం పట్టిందని తెలిపారు. గతంలో బియ్యపు గింజలపై వందే మాతరం లిఖించారు. ఆయనన్ను పలువురు అభినందించారు.